# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా..



విలేకరులు కావలెను
http://vaasthavanestham.com
వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...
సంప్రదించండి
తెలంగాణ 8099779988
ఆంధ్రప్రదేశ్ 9985337979
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో
వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన
- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 | సంచిక : 239 | సోమవారం 11 మార్చి 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri




## ట్రాఫిక్ పోలీస్.. ఇక 24/7 రోడ్ల మీదే

- ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు సమగ్ర ప్రణాళిక
- అదనంగా 2,500 మంది సిబ్బంది నియామకానికి నిర్ణయం
- ఫ్రీ లెఫ్ట్ బ్లాక్‌లు, వాహనాల బ్రేక్ డౌన్‌ల పరిష్కరించడమే వీరి పని
- సాధ్యమైనంత వరకు ప్రజా రవాణా వినియోగించేలా అవగాహన

హైదరాబాద్

నగరవాసికి నిత్యం నరకప్రాయంగా మారిన ట్రాఫిక్ నియంత్రణపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. గంటల తరబడి నగరరోడ్లపై చిక్కుకుపోయి తిప్పలు పడుతున్న వాహనచోదకులకు ఊరట కలిగించేందుకు, పనిలో పనిగా వాయు, శబ్ద కాలుష్యానికి చెక్ పెట్టేందుకు పోలీసు శాఖ సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తోంది. అదనపు సిబ్బందితోనే వాహనాల రద్దీని అదుపు చేయడం సాధ్యమవుతుందని గుర్తించింది. ఈ మేరకు అదనపు ట్రాఫిక్ సిబ్బందిని సమకూర్చుకోవాలని -మిగతా3లో

# మహిళలందరూ మహాలక్ష్మీలు



- మహిళలకు 2,500, కొత్త రేషన్ కార్డులు..!
- గుడ్ న్యూస్ చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి..
- 55 ఏళ్ల లోపు మహిళలకు నెలకు రూ.2500 ఆర్థిక సాయం అందించే పథకం అమలుకు కాంగ్రెస్ సర్కార్ కసరత్తు
- ఈ నెల 12న సచివాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు తెలంగాణ కేబినెట్ సమావేశం
- కొత్త రేషన్ కార్డులు జారీ చేసే అంశంపై కేబినెట్ నిర్ణయం

హైదరాబాద్

మహిళలకు తీపి వార్త చెబుతామంటున్నారు సీఎం రేవంత్. ఈ నెల 12 దాకా ఆగితే చాలు మహిళలు మహాలక్ష్మలవుతారంటున్నారు ఆయన. ఇంతకీ రేవంత్ చెప్పబోయే ఆ స్వీట్ న్యూస్ ఏంటో ఈ వార్తలో తెలుసుకోండి.. 55 ఏళ్ల లోపు మహిళలకు నెలకు రూ.2500 ఆర్థిక సాయం అందించే పథకం అమలుకు కాంగ్రెస్ సర్కార్ కసరత్తు చేస్తోంది. తమ ఆరు గ్యారంటీల్లో ఒకటైన ఈ మహాలక్ష్మి పథకానికి సంబంధించి, విధి విధానాల రూపకల్పనకు ప్రభుత్వం నడుం బిగించింది. దీనిలో భాగంగా ఈ నెల 12న సచివాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు తెలంగాణ కేబినెట్ సమావేశం కానుంది. మహిళలకు నెలకు 2500 రూపాయల ఆర్థిక సహాయం అందించే పథకంతో పాటు కొత్త రేషన్ కార్డులు జారీ చేసే అంశంపై కేబినెట్ నిర్ణయం తీసుకోనుంది. ఇక దీంతో పాటు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులను పునఃపరిశీలించి మరోసారి గవర్నర్ కు సిఫారసు చేయనుంది కేబినెట్. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. మహిళా స్వయం సహాయక సంఘాలతో -మిగతా3లో

## బీఆర్ఎస్‌కు బిగ్ షాక్



- బీజేపీ తీర్థం పుచ్చుకున్న నలుగురు ముఖ్య నాయకులు
- మహబూబాబాద్, ఆదిలాబాద్ మాజీ ఎంపీలు సీతారాం నాయక్, గోడం నగేశ్‌తో పాటు శానంపూడి సైదిరెడ్డి, జలగం వెంకట్రావు చేరిక
- పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన తరుణ్ చుగ్
- కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర నాయకులు లక్ష్మణ్, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి

హైదరాబాద్

పార్లమెంట్ ఎన్నికల వేళ బీఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన నలుగురు కీలక నేతలు బీజేపీలో చేరారు. మాజీ ఎమ్మెల్యేలు మాజీ ఎమ్మెల్యేలు సైదిరెడ్డి, జలగం వెంకట్రావు, మాజీ ఎంపీలు గొడెం నగేష్, సీతారాం నాయక్ బీజేపీలో చేరారు. బీజేపీ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ తరుణ్ చుగ్, లక్ష్మణ్ పార్టీ కండువా కప్పి వారిని ఆహ్వానించారు. మహబూబాబాద్, ఆదిలాబాద్ మాజీ ఎంపీలు సీతారాం నాయక్, గోడం నగేశ్, హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ -మిగతా3లో



### బీజేపీకి పొరపాటున కూడా ఓటేయొద్దు

- 'ధర్మం - అధర్మం' మధ్య యుద్ధం: కేజ్రీవాల్
- కురుక్షేత్ర యుద్ధంలో కౌరవుల దగ్గర అన్నీ ఉన్నా.. యుద్ధంలో గెలువలేకపోయారు.
- మేము చిన్న వాళ్లమే కావొచ్చు. మాతో శ్రీకృష్ణుని ధర్మం ఉంది
- బహిరంగ సభలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్

## దోస్త్ మేరా దోస్త్?



- కాంగ్రెస్‌తో చెలిమి దిశగా మజ్లిస్ అడుగులు
- కాంగ్రెస్‌తో చెలిమి దిశగా మజ్లిస్ అడుగులు
- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ముందుజాగ్రత్తలు
- హైదరాబాద్ పార్లమెంటరీ స్థానం తమదేనని ధీమా
- అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్ డమ్మీల కోసం ఎంఐఎం పావులు

చార్మినార్

పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో పాతబస్తీ రాజకీయం రసవత్తరంగా మారనున్నదా... సరికొత్త ఎత్తులు, పొత్తులకు రంగం సిద్ధమవుతున్నదా... కాంగ్రెస్ పార్టీకి మజ్లిస్ స్నేహహస్తం అందించనున్నదా.. మెట్రోరైలు పనుల శంకుస్థాపన వేదిక సరికొత్త రాజకీయ పరిణామాలకు అంకురార్పణ చేసిందా... అంటే అవుననే అంటున్నాయి తాజా రాజకీయ పరిణామాలు. ఇటీవల పాతబస్తీలో మెట్రో రైలు పనుల శంకుస్థాపన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలు -మిగతా3లో

## అసంబద్ధ హామీలతో కాంగ్రెస్‌కు అధికారం



- మోసగాడైనా.. నిజాయితీగల్ల మోసగాడు రేవంత్ రెడ్డి..
- ఎన్నికల్లో గెలిస్తే మగాడు.. ఓడితే మగాడు కాదా?.
- ఈ నెల 17వ తేదీ వరకు ఓపిక పడతాం
- కాంగ్రెస్ పాలన వంద రోజులు అయ్యాక ప్రజల్లోకి వెళ్తాం
- గొర్రె కసాయివాడ్ని నమ్మినట్లు తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మారు
- రుణమాఫీ చేయకపోతే రైతులు కాంగ్రెస్ భరతం పడతారు
- ఓడితే మగాడు కాదా?.. సీఎం రేవంత్‌పై కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు

కామారెడ్డి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ చిల్లరగా మాట్లాడటం ఇకనైనా మానాలని.. తన సవాల్‌కు స్పందించి మల్కాజ్‌గిరిలో గెలిచి దమ్మేంటో నిరూపించుకోవాలని అన్నారు. ఎన్నికల్లో గెలిస్తే మగాడు.. ఓడితే మగాడు కాదా?. నా సవాల్‌ను రేవంత్ రెడ్డి ఎందుకు స్వీకరించడం లేదు. మల్కాజ్‌గిరిలో ఇద్దరం పోటీ చేద్దాం.. ఎవరు మగాడో తేల్చుకుందాం అని రేవంత్‌ను కేటీఆర్ ఛాలెంజ్ చేశారు. అసంబద్ధ హామీలతో తెలంగాణ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. -మిగతా3లో

## అభ్యర్థులను ప్రకటించిన టీఎంసీ..

- బహరంపూర్ నుంచి పార్టీ అభ్యర్థిగా టీమిండియా మాజీ క్రికెటర్ యూసఫ్ పఠాన్
- కృష్ణానగర్ నుంచి మాజీ ఎంపీ మహువా మొయిత్రా
- మమత బెనర్జీ మేనల్లుడు, వారసుడు 'అభిషేక్ బెనర్జీ' డైమండ్ హార్బర్ నుంచి పోటీ
- టీఎంసీ అభ్యర్థుల జాబితాలో కనిపించని 'నుస్రత్ జహాన్' పేరు



# కేంద్ర మంత్రికి నిరసన సెగ!
# నల్లజెండాలతో 'గో బ్యాక్' నినాదాలు

బీజేపీ ఎంపీ, కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్‌కు నిరసన సెగ తగిలింది. బిహార్‌లోని తన సొంత పార్లమెంటరీ నియోజకవర్గమైన బెగుసరాయ్‌లో పార్టీ కార్యకర్తల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వచ్చింది. బచ్వాడాలో ఒక కార్యక్రమానికి వెళుతుండగా సొంత పార్టీ కార్యకర్తలే ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నల్ల జెండాలను ప్రదర్శించారు. గిరిరాజ్ సింగ్ ఇటీవల తన బెగుసరాయ్ నియోజకవర్గంలో యాక్టివ్ అయ్యారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు నిరంతరం చేరువయ్యే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించడంతో పాటు పలు ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు చేస్తున్నారు.

ఆదివారం బరౌని డెయిరీ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ముగించుకుని బచ్వాడలో మరో ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తుండగా ఎన్‌హెచ్-28లోని రాణి గ్రామ సమీపంలో సొంత పార్టీ కార్యకర్తలే కేంద్ర మంత్రి గిరిరాజ్? సింగ్‌కు నల్లజెండాలు చూపించారు. కాన్వాయ్‌ను చుట్టుముట్టిన వారు, బీజేపీ జెండాలతో పాటు నల్ల జెండాలను పట్టుకుని, ఆయన వెళ్లిపోవాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. దీంతో గిరిరాజ్ సింగ్ కాన్వాయ్ కొద్దిసేపు నిలిచిపోయింది.

సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నల్లజెండాలు



చూపుతున్న వారిని చెదరగొట్టి సాధారణ పరిస్థితులు తీసుకొచ్చారు. జిల్లాలో ఏర్పాటు చేసిన పెప్సీ ప్లాంట్‌లో బెగుసరాయ్ వాసులెవరికీ ఉపాధి కల్పించలేదని నిరసనకారులు చెబుతున్నారు. ఆయనకు డబ్బులిచ్చినవారికి మాత్రమే ఉపాధి కల్పించారని ఆరోపించారు. అయితే తమ కార్యకర్తలు కేంద్ర మంత్రికి స్వాగతం పలికేందుకే వచ్చారని బీజేపీ చెబుతోంది. నల్ల జెండాలు ప్రదర్శించినవారు సీపీఐ మద్దతుదారులని పేర్కొంది.

# బీజేపీకి పొరపాటున కూడా ఓటేయొద్దు

ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ 'అరవింద్ కేజ్రీవాల్' లోక్‌సభ 2024 ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇందులో భాగంగా ఈ రోజు కేజ్రీవాల్ హర్యానాలోని కురుక్షేత్రలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ.. బీజేపీ ప్రభుత్వాన్ని నమ్మొద్దని వ్యాఖ్యానించారు. సమావేశంలో కేజ్రీవాల్ మాట్లాడుతూ.. హిందూ ఇతిహాసమైన మహాభారతాన్ని ఉదాహరణగా వెల్లడిస్తూ.. రాబోయే ఎన్నికలు 'ధర్మం – అధర్మం' మధ్య జరిగే పోరు అని వ్యాఖ్యానించారు. ఈ సారి పొరపాటున కూడా బీజేపీకి ఓటేయొద్దని ఓటర్లను కేజ్రీవాల్ కోరారు. కురుక్షేత్ర యుద్ధంలో కౌరవుల దగ్గర అన్నీ ఉన్నా.. యుద్ధంలో గెలువలేకపోయారు. కానీ పాండవుల దగ్గర ఏమీ లేదు, కానీ శ్రీకృష్ణుడు మాత్రమే ఉన్నారు. యుద్ధంలో గెలిచారు. మేము చిన్న వాళ్ళమే కావొచ్చు. మాతో శ్రీకృష్ణుని ధర్మం ఉందని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. ఈసారి ఎట్టి పరిస్థితుల్లో బీజేపీకి ఓటేయొద్దని, ప్రజలు బాగా ఆలోచించి మీ నియోజక వర్గంలో మంచి అభ్యర్థిని ఎన్నుకోవాలని సూచించారు. కష్ట సమయంలో మీ కోసం పనిచేసే నాయకుడు మీకు ప్రజా ప్రతినిధిగా ఎన్నికైతే అవసరాలకు ఉపయోగపడతారని కేజ్రీవాల్ పేర్కొన్నారు.

**'మోదీ' నినాదాలు చేస్తే..**
**భోజనం పెట్టమని చెప్పండి: సీఎం కేజ్రీవాల్**



సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ విమర్శలు, ప్రతివిమర్శలు.. సవాళ్లు, ప్రతిసవాళ్లతో ఎన్నికల రాజకీయం వేడెక్కుతోంది. తాజాగా ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మోదీపై కీలక వ్యాఖ్యలు చేశారు. 'మహిళా సమ్మాన్ సమారోహ్' పేరుతో నిర్వహించిన మహిళల సభలో సీఎం కేజ్రీవాల్ పాల్గొని ప్రసంగించారు. 'చాలా మంది పురుషులు ప్రధాని మోదీ పేరుతో నినాదాలు చేస్తున్నారు. మహిళలు వారి ఆలోచనలు మార్చాలి. మీ(మహిళలు) భర్తలు మోదీ నినాదాలు చేస్తే.. తమకు భోజనం పెట్టమని చెప్పండి' అని కేజ్రీవాల్ అన్నారు. మహిళలు తమ కుటుంబ సభ్యులతో చర్చించి.. ఆప్‌కు తమ మద్దతు ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా బీజేపీకి మద్దతుగా ఉన్న మహిళలకు చెప్పండి.. తమ సోదరుడు(కేజ్రీవాల్) మహిళలందరికీ అండగా ఉంటాడని చెప్పాలన్నారు. 'వారికి (బీజేపీకి మద్దతు పలికే మహిళలు) చెప్పండి మా ప్రభుత్వం విద్యుత్ ఉచితంగా అందజేస్తుంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. ఇకనుంచి మహిళలకు నెలకు వెయ్యి రూపాయలు ఇవ్వనున్నాం. మహిళకు బీజేపీ ఏం చేసింది. అలాంటప్పుడు బీజేపీకి ఎందుకు ఓటు వేయాలి? మహిళలంతా ఈసారి కేజ్రీవాల్‌కే ఓటు వేయండి' అని సీఎం కేజ్రీవాల్ తెలిపారు. 'కొన్ని పార్టీలు మహిళలకు కొన్ని పదవలు ఇచ్చి.. మహిళా సాధికారత కల్పిస్తున్నామని చెబుతున్నాయి. నేను అలా చెప్పను. మహిళలకు పదవుల ఆశ చూపటం సరికాదు. వాళ్లకు అన్ని అవకాశాలు ఇవ్వాలి. కేవలం ఇద్దరూ లేదా నలుగురు మహిళలకు లబ్ధి కలిగించిటం సరికాదు. మరీ మిగతా మహిళలు పరిస్థితి ఏంటి?' అని కేజ్రీవాల్ విమర్శలు చేశారు. తమ ప్రభుత్వం అందించనున్న ప్రతి మహిళకు నెలకు వెయ్యి రూపాయలు ఇచ్చే పథకమే నిజమైన మహిళా సాధికారతకు నిదర్శనం అన్నారు. ఇక.. ఇటీవల కేజ్రీవాల్ ప్రభుత్వం 2024-25 వార్షిక బడ్జెట్‌లో మహిళలకు నెలకు వెయ్యి రూపాయాలు అందజేస్తామని కేటాయింపులు ప్రకటించిన విషయం తెలిసిందే.

# అభ్యర్థులను ప్రకటించిన టీఎంసీ..

కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన మెగా ర్యాలీలో 'మమతా బెనర్జీ' రాబోయే లోక్‌సభ ఎన్నికల కోసం 42 మంది అభ్యర్థుల జాబితాను ప్రకటించారు. బహరంపూర్ నుంచి పార్టీ అభ్యర్థిగా టీమిండియా మాజీ క్రికెటర్ యూసఫ్ పఠాన్ కృష్ణానగర్ నుంచి మాజీ ఎంపీ మహువా మొయిత్రా బరిలో నిలిచారు. మమత బెనర్జీ మేనల్లుడు, వారసుడు 'అభిషేక్ బెనర్జీ' డైమండ్ హార్బర్ నుంచి పోటీ చేయనున్నారు. నటుడు శత్రుఘ్న సిన్హా అసన్సోల్ నుంచి పోటీ చేయనున్నారు. అయితే సందేశ్‌ఖాలీ వివాదం కారణంగా 'నుస్రత్ జహాన్'ను బసిర్హాట్ స్థానం నుంచి తొలగించి.. ఆ స్థానంలో హాజీ నూరుల్ ఇస్లామ్‌ను బరిలోకి దింపారు.

తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థుల పూర్తి జాబితా

కూచ్‌బెహార్: జగదీష్ చంద్ర బసునియా అలీపుర్దువార్: ప్రకాష్ చిక్ బరైక్ జల్పాయ్‌గురి: నిర్మల్ చంద్ర రాయ్ డార్జిలింగ్: గోపాల్ లామా రాయ్‌గంజ్: కృష్ణ కళ్యాణి బాలూర్ఘాట్: బిప్లబ్ మిత్ర మాల్దా నార్త్: ప్రసూన్ బెనర్జీ మాల్దా సౌత్: షానవాజ్ అలీ రెహాన్ జంగీపూర్: ఖలుయిలుర్ రెహమాన్ బెర్హంపూర్: యూసుఫ్ పఠాన్ ముర్షిదాబాద్: అబూ తాహెర్ ఖాన్ కృష్ణానగర్: మహువా మొయిత్రా రణఘాట్: ముకుట్ మణి అధికారి బొంగావ్: బిస్వజిత్ దాస్ బర్రా



క్పూర్: పార్థ భౌమిక్ దుండం: సౌగత రాయ్ బరాసత్: కకోలి ఘోష్ దస్తిదార్ బసిర్హత్: హాజీ నూరుల్ ఇస్లాం జాయ్‌నగర్: ప్రతిమ మండల్ మధురాపూర్: బాపి హల్దర్ డైమండ్ హార్బర్: అభిషేక్ బెనర్జీ జాదవ్‌పూర్: సయోని ఘోష్ కోల్‌కతా సౌత్: మాలా రాయ్ డబ్ల్యూ కోల్జాత నార్త్: సుదీప్ బంద్యోపాధ్య హౌరా: ప్రసూన్ బెనర్జీ ఉకుబెర్రా: సజ్దా అహ్మద్ సెరాంపూర్: కళ్యాణ్ బెనర్జీ హుగ్లీ: రచనా బెనర్జీ ఆరంబాగ్: మిటాలి బాగ్ తమ్లుక్: దేబాంగ్షు భట్టాచార్య కాంతి: ఉత్తమ్ బారిక్ ఘటల్: దేవ్ దీపక్ అధికారి ఝర్గ్రామ్: కలిపాడా సోరెన్ మిద్నాపూర్: జూన్ మాలియా పురూలియా: శాంతిరామ్ మహతో బుర్ద్వాన్ వెస్ట్: అరూప్ చక్రనోర్తి బర్ద్వాన్ ఈస్ట్: డాక్టర్ షర్మిలా సర్కార్ దుర్గాపూర్ బుర్ద్వాన్: కీర్తి ఆజాద్ అసన్సోల్: శత్రుఘ్న సిన్హా బోల్పూర్: అసిత్ మాల్ బీర్భం: సతాబ్ది రాయ్ బిష్ణుపూర్: సుజాత మోండల్ ఖాన్

**టీఎంసీ అభ్యర్థుల జాబితాలో కనిపించని 'నుస్రత్ జహాన్' పేరు**

మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ఈరోజు పశ్చిమ బెంగాల్ నుంచి రాబోయితే లోక్‌సభ ఎన్నికలకు మొత్తం 42 మంది అభ్యర్థులను ప్రకటించింది. ఈ జాబితాలో బహరంపూర్ స్థానం నుండి మాజీ క్రికెటర్ యూసఫ్ పఠాన్, అసన్సోల్ నుంచి శత్రుఘ్న సిన్హా, దుర్గాపూర్ నుంచి కీర్తి ఆజాద్ వంటి కొన్ని ప్రముఖ పేర్లు ఉన్నాయి. టీఎంసీ పార్టీ 16 మంది సిట్టింగ్ ఎంపీల పేర్లతో పాటు, 12 మంది మహిళా అభ్యర్థులను బరిలోకి దింపింది. అయితే కృష్ణానగర్ స్థానం నుంచి బహిష్కరణకు గురైన లోక్‌సభ ఎంపీ మహువా మొయిత్రాను పార్టీ వరుసగా రెండోసారి మళ్లీ నామినేట్ చేసింది. సందేశ్‌ఖాలీ వివాదం కారణంగా 'నుస్రత్ జహాన్'ను బసిర్హాట్ స్థానం నుంచి తొలగించి.. ఆ స్థానంలో హాజీ నూరుల్ ఇస్లామ్‌ను బరిలోకి దింపారు. కాగా ఏప్రిల్-మేలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల తేదీలను వచ్చే వారం ప్రకటించే అవకాశం ఉంది.

# అభివృద్ధిని ఇండియా కూటమి ఓర్వలేదు

ప్రధాని నరేంద్ర మోదీ ఈరోజు(ఆదివారం) ఉత్తరప్రదేశ్‌లోని అజంగఢ్‌లో రూ.42 వేల కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ 'అజంగఢ్‌లో గతంలో మాఫియా పాలన ఉండేదని, ఇప్పుడు ఇక్కడి ప్రజలు చట్టబద్ధమైన పాలనను చూస్తున్నారని పేర్కొన్నారు. దీంతో 'ఇండియా కూటమి'కి నిద్రపట్టడంలేదని ప్రధాని మోదీ విమర్శించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ఉత్తర్ ప్రదేశ్‌లోని అజంగఢ్ జిల్లాలో మందూరి విమానాశ్రయ సముదాయంలో రూ.34,700 కోట్లతో 782 అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా 12 కొత్త టెర్మినల్ భవనాలతో సహా 15 విమానాశ్రయ ప్రాజెక్టులను మోదీ ప్రారంభించారు. ప్రధాని మోదీ ప్రారంభించిన, శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులలో అజంగఢ్, శ్రావస్తి, మొరాదాబాద్, చిత్రకూట్, అలీఘర్ విమానాశ్రయాలు ఉన్నాయి. దీంతోపాటు చౌదరి చరణ్ సింగ్ అంతర్జాతీయ విమానాశ్రయం, లక్నో కొత్త టెర్మినల్ ప్రారంభోత్సవం కూడా కలవు.



అజంగఢ్ అభివృద్ధికి బాటలు వేస్తుందని, నక్షత్రంలా వెలిగిపోతుందని మోదీ పేర్కొన్నారు. గత ప్రభుత్వాల నేతలు కేవలం పథకాలను మాత్రమే ప్రకటించేవారని విమర్శించారు. మోదీ కింది స్థాయి నుంచి వచ్చిన వ్యక్తి అని, దేశాభివృద్ధే లక్ష్యంగా తన ప్రయాణం సాతున్నదని అన్నారు. అజంగఢ్ అభివృద్ధికి చిహ్నంగా మారుతుందని మోదీ హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం ప్రజల కళ్లలో దుమ్ము కొట్టిందని ఆరోపించారు. తాము దేశంలో అనేక రైల్వే స్టేషన్లు ఏకకాలంలో నిర్మిస్తున్నామన్నారు. దేశం మొత్తం మీద అనేక అభివృద్ధి ప్రాజెక్టులు ఇక్కడ నుండే ప్రారంభమవుతున్నాయని, ఈరోజు దాదాపు రూ.34 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను అజంగఢ్ నుంచి ప్రారంభించామన్నారు.

## ఓ హీరోయిన్‌కి తిరస్కరణ..
## లోక్‌సభ ఎన్నికల్లో మరో హీరోయిన్‌కి ఛాన్స్




తెలుగులో ఒకప్పుడు హీరోయిన్‌గా చేసి, ఇప్పుడు సీరియల్స్‌లో నటిస్తున్న నటికి లోక్‌సభ ఎన్నికల్లో సీటు దక్కింది. తాజాగా పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికలకు సంబంధించిన హడావుడి మొదలైపోయింది. తాము రాష్ట్రంలో ఒంటరిగానే బరిలో దిగుతున్నట్లు సీఎం మమతా బెనర్జీ ప్రకటించారు. మొత్తం 42 స్థానాలకు గానూ ఎవరెవరు పోటీ చేస్తున్నారనే విషయమై క్లారిటీ ఇచ్చేశారు. ఇందులోనే ప్రముఖ నటికి అవకాశం దక్కడం చర్చనీయాంశమైంది. తెలుగులో 'బావగారు బాగున్నారా!', 'కన్యాదానం', 'మావిడాకులు' చిత్రాల్లో నటించిన రచన బెనర్జీ.. తెలుగు, తమిళ, కన్నడ, బెంగాలీ, ఒరియా భాషల్లో పలు సినిమాల్లో హీరోయిన్‌గా చేసింది. ఇప్పుడు ఈమెకే మమతా బెనర్జీ టికెట్ కేటాయించారు. హుగ్లీ నుంచి నటి రచనా బెనర్జీ బరిలోకి దిగనున్నారు. మరోవైపు గత ఎన్నికల్లో బసిర్హాట్ నుంచి గెలిచిన హీరోయిన్ నుస్రత్ జహాన్‌కు ఈసారి మొండిచేయి ఎదురైంది. సందేశ్ ఖాలీ వివాదమే ఇందుకు కారణం.

## ఒక్క నిమ్మకాయ రూ.35వేలు!



తమిళనాడులోని ఓ ఆలయంలో నిర్వహించిన వేలంలో ఒక్క నిమ్మకాయ రూ.35,000 పలికింది. శివరాత్రి సందర్భంగా ఆ మహా శివుడికి సమర్పించిన నిమ్మకాయను ఆలయ అధికారులు వేలం వేయగా ఓ భక్తుడు అత్యధిక మొత్తానికి దక్కించుకున్నారు. తమిళనాడులోని ఈరోడ్‌కి 35 కిలోమీటర్ల దూరంలోని శివగిరి గ్రామ సమీపంలోని పాతపూసయ్య ఆలయంలో శుక్రవారం రాత్రి మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా శివుడికి సమర్పించిన నిమ్మకాయ, పండ్లతోపాటు ఇతర వస్తువులను ఆచారం ప్రకారం వేలం వేశారు. ఈ వేలంలో 15 మంది భక్తులు పాల్గొనగా, ఈరోడ్‌కు చెందిన ఒక భక్తుడు రూ. 35,000కు నిమ్మకాయను దక్కించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. వేలం వేసిన నిమ్మకాయను ఆలయ పూజారి స్వామివారి ముందు ఉంచి పూజ చేసి వందలాది మంది భక్తుల సమక్షంలో వేలం దక్కించుకున్న భక్తుడికి అందజేశారు. స్వామివారికి సమర్పించిన నిమ్మకాయను పొందడం అదృష్టంగా భక్తులు భావిస్తారు. తమకు అష్ట ఐశ్వర్యాలు, ఆయురారోగ్యాలు లభిస్తాయని నమ్ముతారు.

## 'ఎలక్షన్ కమిషన్ ప్రైవేటీకరణ'..
## శివసేన ఎంపీ తీవ్ర వ్యాఖ్యలు



సార్వత్రిక ఎన్నికల ముంగిట కేంద్ర ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయెల్ రాజీనామా నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్‌పై శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎలక్షన్ కమిషన్ బీజేపీ శాఖలా మారిందని ఆరోపించారు. ముంబైలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సంఘాన్ని బీజేపీ ప్రైవేటీకరించిందని మండిపడ్డారు. 'ఎలక్షన్ కమిషన్ బీజేపీ శాఖలా మారింది. టీఎన్ శేషన్ (మాజీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్) హయాంలో ఉన్నట్టుగా వ్యవస్థ ఇప్పుడు లేదు. విశ్వసనీయమైన నియంత్రణ సంస్థగా ఉండే ఎలక్షన్ కమిషన్ ఇప్పుడు విశ్వసనీయతను కోల్పోయింది. గత పదేళ్లలో ఎలక్షన్ కమిషన్ ప్రైవేటీకరించారు' అన్నారు. ఎలక్షన్ కమిషన్ తీరును విమర్శిస్తూ 'ఈ రోజుల్లో ఎలక్షన్ కమిషన్ ఎలా పని చేస్తోందో శివసేన (యూబీటీ), ఎన్‌సీపీ అనుభవించాయి. ఎన్‌సీపీ పార్టీని, ఎన్నికల గుర్తును అనర్హులకు అప్పగించారు.మనకు తెలిసిన ఎ?న్నికల కమిషన్ ఎప్పుడో చచ్చిపోయింది' అన్నారు. ఎన్‌సీపీలో ఇటీవల చీలిక వచ్చింది. అజిత్ పవార్ వర్గానికే పార్టీ ఎన్నికల గుర్తు అయిన గడియారం గుర్తను ఎలక్షన్ కమిషన్ కేటాయించింది. పార్టీ చీలిక తర్వాత అజిత్ పవార్ మహారాష్ట్ర డిప్యుటీ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. ఇది శరత? పవార్ వర్గానికి శరాఘాతంగా మారింది. ఇక శివసేన విషయంలోనూ తిరుగుబాటు నేత ఏక్‌నాథ్ షిండే వర్గానికే పార్టీ అధికారిక బాణం, విల్లు ఎన్నికల గుర్తును ఎలక్షన్ కమిషన్ కేటాయించింది. దీంతో ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) కాగడా గుర్తును వినియోగిస్తోంది.

## ఎన్నికల వేళ.. బీజేపీకి బిగ్ షాక్



లోక్‌సభ ఎన్నికల ముందర బీజేపీకి బిగ్ షాక్ తగిలింది. ఆ పార్టీ ఎంపీ బ్రిజేందర్ సింగ్ (51) ఆదివారం బీజేపీకి రాజీనామా ప్రకటించారు. రాజీనామా ప్రకటించిన కొన్నిగంటలకే ఏఐసీసీ ప్రెసిడెంట్ మల్లికార్జున ఖర్గే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిపోయారు. హర్యానా రాజకీయ దిగ్గజం, కేంద్ర మాజీ మంత్రి చౌద్రీ బీరేందర్ సింగ్(77) తనయుడే ఈ బ్రిజేందర్ సింగ్. హర్యానా హిసార్ పార్లమెంటరీ స్థానం నుంచి బ్రిజేందర్ సింగ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ముందుగా తన రాజీనామాను ఎక్స్ అకౌంట్ ద్వారా పోస్ట్ చేశారాయన.

# అసంబద్ధ హామీలతో కాంగ్రెస్‌కు అధికారం

-మొదటి పేజి తరువాయి

కామారెడ్డి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. ప్రజలు మోసపోవాలనే కోరుకుంటారు అని రేవంత్ రెడ్డి టీవీల్లో చెప్పారు. ప్రజలు మోసగాళ్లనే నమ్ముతారు.. ప్రజలు కోరుకునేది మేం చేస్తాం అని రేవంత్ చెప్పిండు. ఆయన నిజాయితీగా చెప్పిండు. మోసగాడైనా నిజాయితీగల్ల మోసగాడు రేవంత్ రెడ్డి.. మోసం చేస్తా అని చెప్పిండు మోసం చేసిండు అని కేటీఆర్ పేర్కొన్నారు. గొర్రెలు కసాయిలను నమ్ముతది.. అట్లనే మోసపోయేటోళ్లు మోసం చేసే వాళ్లనే నమ్ముతారు అని తెలిపారు. పొంకనాల పోతిరెడ్డి లాగా ఎన్నో మాటలు చెప్పిండు రేవంత్ రెడ్డి. రూ. 2 లక్షల రుణం తెచ్చుకుంటే డిసెంబర్ 9న మాఫీ చేస్తానని పొంకనాల పోతిరెడ్డి నరికిండు. డిసెంబర్ 9, జనవరి 9, ఫిబ్రవరి 9 పాయే.. మార్చి 9 కూడా పీకింది. ఇప్పుడు మనం యాది చేస్తే.. ఏవేవో మాట్లాడుతున్నారు. యాది చేస్తాం.. రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోతే నీ భరతం పడుతాం అని రేవంత్ రెడ్డిని కేటీఆర్ హెచ్చరించారు.

**కాంగ్రెస్ పార్టీకి బొంద తవ్వేది ఆడబిడ్డలే..**

ఆడపిల్లల వివాహాలకు తులం బంగారం ఇస్తానని రేవంత్ ఎన్నికల సమయంలో చెప్పిండు.. మూడు నెలలు



అవుతుంది.. ఇంత వరకు తులం బంగారం ఇవ్వలేదు. ఇప్పటికీ కేసీఆర్ అమలు చేసిన కల్యాణలక్ష్మి చెక్కులే ఇస్తున్నారు. రూ. లక్షనే ఇస్తుండు. బంగారం లేదు.. మన్ను లేదు. వంద రోజులు నిండిన తర్వాత కాంగ్రెస్ పార్టీకి బొంద తవ్వేది ఈ ఆడబిడ్డలే అని చెబుతున్నాను. ఎక్కువ టైం పట్టదు.. మార్చి 17కు వంద రోజుల సినిమా పూర్తవుతది. మహాలక్ష్మి కింద ఇంట్లో కోడళ్లు ఉంటే రూ. 2500 ఇస్తా, అత్తలకు నెలకు రూ. 4 వేలు, వారి భర్తలకు రూ. 4 వేలు ఇస్తా అని చెప్పిండు రేవంత్. మరి మహాలక్ష్మి ఎక్కడికి పోయింది. రైతులకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తా అన్నాడు. ఇప్పుడు యాసంగి పంట కోతకు వస్తుంది. నీకు చిత్తశుద్ధి ఉంటే, రైతుల మీద ప్రేమ ఉంటే.. ఎన్నిల కోడ్ వచ్చే లోపు బోనస్ ప్రకటించాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

మా అయ్య పేరు కేసీఆర్. నేను ఉద్యమం చేసి రాజకీయాల్లోకి వచ్చా. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచా. అంతేగానీ రేవంత్‌రెడ్డిలాగా రాంగ్ రూట్‌లో రాలేదు. ఆంధ్రోళ్ల బూట్లు నాకి, పార్టీ మారి రేవంత్ సీఎం అయ్యారు. కారు కూతలు, చిల్లర మాటలు రేవంత్ ఇకనైనా మానుకోవాలి. సీఎంలాగా హుందాగా మాట్లాడాలి..

.. మేడిగడ్డలో 85 పిల్లర్లు ఉంటే.. అందులో మూడు కుంగిన మాట వాస్తవం. అంతేకానీ కాళేశ్వరం, మేడిగ్గ కొట్టుకుపోలేదు. మూడు నెలల సమయంలో ఈ ప్రభుత్వానికి పిల్లర్లు బాగు చేసే సమయం దొరకడం లేదా?. ఈ నెల 17వ తేదీ వరకు ఓపిక పడతాం. కాంగ్రెస్ పాలన వంద రోజులు అయ్యాక ప్రజల్లోకి వెళ్తాం. గొర్రె కసాయివాడ్ని నమ్మినట్లు తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మారు. రుణమాఫీ చేయకపోతే రైతులు కాంగ్రెస్ భరతం పడతారు అని కేటీఆర్ హెచ్చరించారు. ఇక చివర్లో.. కామారెడ్డి ఫలితం చేదు అనుభవం మిగిల్చిందన్న కేటీఆర్ ఆ ఎన్నికలపై చర్చ వద్దంటూ పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు.

# ట్రాఫిక్ పోలీస్.. ఇక 24/7 రోడ్ల మీదే

-మొదటి పేజి తరువాయి

నిర్ణయించింది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ ట్రై కమిషనరేట్లకు కలిపి అదనంగా 2,500 మంది ట్రాఫిక్ సిబ్బంది అవసరమని గుర్తించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. 24/7 రోడ్ల మీదనే ఉంటూ వాహనాలు, ట్రాఫిక్ రద్దీని క్రమబద్ధీకరించడమే ఈ అదనపు సిబ్బంది పని. ఇటీవల పోలీసుఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించి నగర ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఈ మేరకు హైదరాబాద్ పోలీసు కమిషనరేట్‌కు 1,000, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్లకు 1,500 మంది అదనపు ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు.



**ట్రాఫిక్ రద్దీ ఇలా..**

ప్రధానంగా రహదారులపై ఫ్రీ లెఫ్ట్ బ్లాక్‌లు, వాహనాల బ్రేక్ డౌన్‌లే నగరంలో ట్రాఫిక్ సమస్యలకు ప్రధాన కారణాలని పోలీసులు గుర్తించారు. దీంతో ఆయా అంశాలపై తక్షణమే స్పందించేందుకు ఈ అదనపు ట్రాఫిక్ పోలీసులు రోజంతా రోడ్లపైనే ఉంచాలని నిర్ణయించారు. ఈ సిబ్బంది ప్రత్యేక ప్రణాళికలతో వర్షాకాలంలో రోడ్లపై ఎదురయ్యే సమస్యలను కూడా పరిష్కరించనున్నారు. ట్రాఫిక్ నిర్వహణలో భాగంగా ఇప్పటికే రాంగ్ సైడ్ డ్రైవింగ్‌లపై గ్రేటర్ ట్రాఫిక్ విభాగం కఠినంగా వ్యవహరించడం ప్రారంభించింది. ద్వి, మూడు చక్రాల వాహనాలకు రూ.200, నాలుగు, అంతకంటే ఎక్కువ చక్రాల వాహనాలకు రూ.700 చొప్పున జరిమానాలు విధిస్తోంది. అలాగే ట్రావెల్ బస్సులు, భారీ వాహనాలు నగర రోడ్లపై నిర్దేశిత సమయాల్లోనే వచ్చేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. దీంతో రోడ్లపై వాహనాల కదలికలు సాఫీగా, వేగంగా జరుగుతాయని ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు.

**వ్యక్తిగత కార్ల వినియోగాన్ని తగ్గించేలా..**

వాహనదారులు, కాలనీవాసుల సూచనల మేరకు అవసరమైన చోట యూ టర్న్‌లు, కూడళ్లను ఏర్పాటు చేస్తున్నారు. అయితే ఇవి స్వల్ప కాలిక పరిష్కారం మాత్రమేనని, రోజూ నగర రోడ్లపైకి వస్తున్న వందలాది వాహనాలను తగ్గిస్తేనే శాశ్వత పరిష్కారం ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఈ క్రమంలో వ్యక్తిగత కార్ల వినియోగాన్ని తగ్గించి, సాధ్యమైనంత వరకు ప్రజారవాణా వ్యవస్థను వినియోగించేలా అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. ఎక్కువమంది ప్రజలు మెట్రో, బస్సులలో ప్రయాణిస్తే రోడ్లపై వాహనాల రద్దీ తగ్గడంతోపాటు వాతావరణ కాలుష్యం కూడా తగ్గుతుందని వివరించనున్నారు.

# దోస్త్ మేరా దోస్త్..?




-మొదటి పేజి తరువాయి

ఈ ఊహాగానాలకు ఊతమిస్తున్నాయి. ఇవి ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఓటమి ఎరుగని మజ్లిస్ పార్టీ ఈసారీ నూటికి నూరు శాతం విజయం సాధిస్తాననే ధీమాతో ఉన్నప్పటికీ ఇటు బీజేపీని, అటు ఎంబీటీని ఎదుర్కోవడానికి ఎత్తుగడలను మారుస్తోంది. విరించి ఆసుపత్రి చైర్‌పర్సన్ మాధవీలతను బీజేపీ అధిష్టానం హైదరాబాద్ నుంచి ఎన్నికల బరిలో దింపుతుండటంతో మజ్లిస్ పార్టీ అప్రమత్తమైంది. దీనికి శుక్రవారం పాతబస్తీ ఫలక్‌నుమాలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్న మెట్రో రైలు పనుల శంకుస్థాపన సభలో ఎంఐఎం సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వ్యవహరించిన తీరే నిదర్శనమని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

**కాంగ్రెస్‌తో స్నేహం కలిసి వస్తుందని...**

కాంగ్రెస్ పార్టీతో కొన్నేళ్లుగా ఎడమొహం పెడమొహంగా ఉన్న అసదుద్దీన్ దోస్తానా కోసం స్వరం మార్చారు. ఆయన తాజా బహిరంగ సభలో మాట్లాడుతూ 'సీఎం రేవంత్‌రెడ్డి మొండి ఘటం. ఆ మొండితనమే ఆయనను సీఎం పదవి వరకు తెచ్చింది. అయితే నేను, నా పార్టీవాళ్లు కూడా తలతిక్కోళ్లం. అయినప్పటికీ ఐదేళ్లపాటు హాయిగా ప్రభుత్వాన్ని నడిపేటట్లు పూర్తిగా సహకరిస్తాం' అని ప్రకటించడం గమనార్హం. అసద్ మాటలపై సీఎం రేవంత్ స్పందిస్తూ 'మజ్లిస్ పార్టీని ఓడించడానికి నేను కూడా ప్రయత్నించా. కానీ, వీలు కాలేదు. ఎన్నికలప్పుడే రాజకీయాలు. ఆ తర్వాత అభివృద్ధిపైనే దృష్టి సారిస్తా' అని పేర్కొంటూ పరోక్షంగా స్నేహహస్తం అందించారు.

**డమ్మీలతో డబుల్ గేమ్...**

ఒకవేళ ఎంఐఎం కాంగ్రెస్ పార్టీకి దగ్గరైతే హైదరాబాద్ పార్లమెంటరీ స్థానానికి కాంగ్రెస్ పార్టీ తరఫున డమ్మీ అభ్యర్థిని ఎన్నికల బరిలోకి దించేటట్లు పావులు కదుపుతుందా..? అదే నిజమైతే మరి బీఆర్ఎస్ పార్టీ పరిస్థితి ఏమిటని చర్చ పాతబస్తీలో జోరుగా జరుగుతోంది. బీఆర్ఎస్‌తో కూడా దోస్తానా కొనసాగించి హైదరాబాద్ వరకు తమకు అనుకూలంగా ఉండే అభ్యర్థిని ఎన్నికల బరిలోకి దించేటట్లు చేస్తుండొచ్చని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల నుంచి డమ్మీ అభ్యర్థులు ఎన్నికల బరిలోకి దిగితే తమకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని మజ్లిస్ పార్టీ భావిస్తోంది.

**ఎంబీటీకి చెక్ పెట్టే దిశగా...**

హైదరాబాద్ పార్లమెంటరీ స్థానం నుంచి బరిలో నిలిచేందుకు ప్రయత్నిస్తున్న మజ్లిస్ బాచావో తెహ్రీఖ్(ఎంబీటీ) పార్టీ కాంగ్రెస్ పార్టీ నుంచి తనకు పూర్తిస్థాయిలో మద్దతు లభిస్తుందని గంపెడాశతో ఉంది. ఇటీవలి శాసనసభ ఎన్నికలలో యాకుత్‌పురా నియోజకవర్గం నుంచి కేవలం 878 ఓట్ల తేడాతో పరాజయం పొందినా, మజ్లిస్ పార్టీకి చుక్కలు చూపించిన ఆ పార్టీ అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్ ఈసారి హైదరాబాద్ పార్లమెంటరీ స్థానంపై కన్నేశారు. స్థానిక ప్రజాసమస్యలను తెలుసుకుని ప్రజలకు దగ్గరవుతున్నారు. అటు ఎంబీటీతోపాటు ఇటు బీజేపీ అభ్యర్థిని ఎన్నికల బరిలో ఎదుర్కోవాలంటే కాంగ్రెస్ పార్టీకి దగ్గరవడమే రాజకీయంగా కలిసి వస్తుందని భావించిన మజ్లిస్ పార్టీ ఆ దిశగా ముందుకెళుతూ తన ఎన్నికల వ్యూహాన్ని మార్చినట్లు కనిపిస్తోంది

## కవిత అనవసరంగా మాట్లాడుతున్నారు: మంత్రి సీతక్క

**బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై మంత్రి సీతక్క విమర్శలు**

**మహిళలను కాంగ్రెస్ కు దూరం చేయాలని కవిత ప్రయత్నిస్తోందని ఆరోపణ**

**కవిత సీఎం కావాలనుకుందని వెల్లడి**

**బీఆర్ఎస్ ఓటమితో కవిత ఆశలు అడియాసలయ్యాయని ఎద్దేవా**

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై మంత్రి ధనసరి సీతక్క ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కవిత అనవసరంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. మహిళలను కాంగ్రెస్ నుంచి దూరం చేయాలని కవిత ప్రయత్నిస్తున్నారని, జీవో నెం 3కి వ్యతిరేకంగా విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆ జీవో ఇచ్చింది కేసీఆరేనన్న విషయాన్ని కవిత గుర్తించాలని హితవు పలికారు. ఇకనైనా బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం ఆపి, ప్రజల కోసం ఆలోచించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే సీఎం అవ్వాలని కవిత భావించారని సీతక్క ఆరోపించారు. కానీ బీఆర్ఎస్ ఓడిపోవడంతో కవిత ఆశలు అడియాసలయ్యాయని ఎద్దేవా చేశారు. మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తోందని అన్నారు.

## మహిళలందరూ మహాలక్ష్మీలు

-మొదటి పేజి తరువాయి



ముఖాముఖిలో పాల్గొన్నారు. మహిళా సంఘాలకు సున్నా వడ్డీ రుణాలు అందిస్తామని సీఎం చెప్పారు. అన్ని విద్యుత్ సబ్ స్టేషన్‌లలో సోలార్ ప్లాంట్స్ ఏర్పాటు చేసేలా స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహిస్తామన్నారు ముఖ్యమంత్రి. ఇప్పుడు మీరు లక్షాధికారులే.. ఇందిరమ్మ రాజ్యంలో మీరు కోటీశ్వరులయ్యేలా చేస్తాం అంటూ మహిళలను ఉద్దేశించి అన్నారు రేవంత్. రాబోయే రోజుల్లో ఇందిరమ్మ ఇళ్లను ఆడబిడ్డల పేరు మీదే ఇవ్వాలనుకుంటున్నామన్నారు ఆయన. ఇక ఈ నెల 12వ తేదీ సాయంత్రం పరేడ్ గ్రౌండ్‌లో లక్ష మంది మహిళలతో కార్యక్రమం నిర్వహించబోతున్నామన్నారు సీఎం. ఈ కార్యక్రమంతో సమాజానికి మహిళా శక్తిని చాటుదామన్నారు ముఖ్యమంత్రి. తమ 90 రోజుల పాలనలో 30 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు రేవంత్. మహిళలకు ఉద్యోగాలు ఇవ్వలేదు అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఆరోపిస్తున్నారని, అయితే 30 వేల ఉద్యోగాల్లో 43 శాతం మహిళలకే ఇచ్చామన్నారు సీఎం. తమది ప్రజాస్వామ్య ప్రభుత్వమన్న రేవంత్.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క మహిళా మంత్రి అయినా ఉన్నారా అంటూ కవితను ప్రశ్నించారు.

## బీఆర్ఎస్‌కు బిగ్ షాక్..




-మొదటి పేజి తరువాయి

రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ తరుణ్ చుగ్ సమక్షంలో వీరు నలుగురు బీజేపీలో చేరారు. బీజేపీ కండువాలను కప్పి పార్టీలోకి సాధారంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో తెలంగాణ బీజేపీ నాయకులు లక్ష్మణ్, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు. కాగా ఇప్పటికే పలువురు బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరిన విషయంతెలిసిందే. దీంతో లోక్‌సభ ఎన్నికల ముందు బీఆర్ఎస్‌కు రాష్ట్రంలో గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి.

హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన సైదిరెడ్డి.. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. కేటీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా సైదిరెడ్డికి పేరుంది. ఇక జలగం వెంకట్రావు ఖమ్మం జిల్లాలో కీలక నేత. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం జిల్లా నుంచి ఆయనొక్కరే బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలపొందారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఆయనకు టికెట్ ఇవ్వలేదు. దాంతో అసంతృప్తిలో ఉన్న జలగం వెంకట్రావు.. బీజేపీలో చేరారు. వీరే కాదు.. రానున్న రోజుల్లో మరికొందరు నేతలు సైతం బీజేపీలో చేరుతారని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

బీఆర్ఎస్ పని ఖతం..

బీఆర్ఎస్ నేతలు బీజేపీలో చేరిన సందర్భంగా ఎంపీ లక్ష్మణ్ ప్రసంగించారు. తెలంగాణలో బీఆర్ఎస్ పని ఖతం అయిపోయిందన్నారు. తెలంగాణలో గతంలో కంటే ఎక్కువ పార్లమెంట్ స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎలాంటి ఆరోపణలు లేకుండా మోడీ ప్రభుత్వం దేశం కోసం పని చేస్తుందన్నారు లక్ష్మణ్.

## ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ప్రణీత్ రావుపై కేసు నమోదు

**స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచి అదనపు ఎస్పీ డి.రమేష్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పంజాగుట్ట పోలీసులు**

**ప్రణీత్ రావుతో పాటు మరికొందరిపైనా కేసులు నమోదు**

**కేసు నమోదు కావడంతో ప్రణీత్ రావుని పోలీసులు విచారించే అవకాశాలు**



తెలంగాణలో గత ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతల ఫోన్లను ట్యాపింగ్ చేశారంటూ తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రణీత్ రావుపై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐబీ (స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచి) అదనపు ఎస్పీ డి.రమేష్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసును నమోదు చేశారు. సమాచారాన్ని వ్యక్తిగత పరికరాల్లోకి కాపీ చేసుకున్నాక హార్డ్ డిస్క్‌లను ప్రణీత్ రావు ధ్వంసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో బీఆర్ఎస్ హయాంలో ఎస్ఐబీ డీఎస్పీగా పనిచేసిన ప్రణీత్ రావుతో పాటు మరికొందరిపై కూడా పోలీసులు కేసులు పెట్టారు. ఇటీవల కొన్ని రికార్డులు మాయమైనట్లు అధికారులు గుర్తించారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల మరుసటి రోజు డిసెంబర్ 4న రాత్రి సమయంలో సీసీటీవీ కెమెరాలను ఆఫ్ చేసి డేటాను ధ్వంసం చేసినట్లు అధికారులు గుర్తించారు. ఎలక్ట్రానిక్ పరికరాలలోని సమాచారం, ఇతర డాక్యుమెంట్లు మాయమవ్వడం చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. దీంతో అసలేం జరిగిందో తేల్చేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. కేసు నమోదవడంతో ప్రణీత్‌రావును విచారించే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా ఎస్ఐబీ కార్యాలయంలోని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 2 గదుల్లోని 17 కంప్యూటర్లను ప్రణీత్‌రావు అనధికారికంగా వాడుకున్నారు. ప్రత్యేకంగా ఇంటర్నెట్ సదుపాయాన్ని కూడా ఏర్పాటు చేసుకున్నారు. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు, రికార్డు ధ్వంసం ఆరోపణల నేపథ్యంలో ఇటీవలే ప్రణీత్ రావుని డీజీపీ రవిగుప్తా సస్పెండ్ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొద్ది రోజుల కిందట ప్రణీత్‌ను డీజీపీ కార్యాలయానికి ప్రభుత్వం అటాచ్ చేసింది. విచారణ తర్వాత సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే.

## రేపు యాదాద్రి వెళుతున్న సీఎం రేవంత్ రెడ్డి

**యాదాద్రిలో సోమవారం నుంచి బ్రహ్మోత్సవాలు**

**తొలి రోజున స్వస్తి పూజల్లో పాల్గొననున్న రేవంత్ రెడ్డి**

**అనంతరం భద్రాచలం పయనం**



తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రేపు (మార్చి 11) యాదాద్రి పుణ్యక్షేత్రాన్ని సందర్శించనున్నారు. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి యాదాద్రిలో పర్యటిస్తుండడం ఇదే తొలిసారి. సోమవారం నుంచి యాదాద్రి గుట్టపై లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నెల 21 వరకు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. రేపు బ్రహ్మోత్సవాల తొలి రోజున జరిగే స్వస్తి పూజలలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. ఆరుగురు మంత్రులు కూడా ఈ పర్యటనలో పాల్గొంటున్నారు. లక్ష్మీనరసింహస్వామి దర్శనం అనంతరం సీఎం రేవంత్ రెడ్డి యాదాద్రి నుంచి భద్రాచలం పయనమవుతారు.

# సంపాదకీయం

## అన్నీ రాష్ట్రాలకు, సార్వత్రిక ఎన్నికలు సాధ్యమా

మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత పదేళ్లల్లో అనేక కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటూ మార్పులకు శ్రీకారం చుడుతోంది. అందులో భాగంగా ఒకే దేశం-ఒకే ఎన్నిక నినాదంతో దేశవ్యాప్తంగా ఒకేసారి అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించే దిశగా అడుగులు వేస్తోంది. దీనికి సంబంధించి సాధ్యాసాధ్యాలపై పరిశీలించేందుకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆధ్వరంలో ఒక ఉన్నతస్థాయి కమిటీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీ గత కొద్ది నెలలుగా జమిలీ ఎన్నికల సాధ్యాసాధ్యాలపై పరిశీలన చేపడుతుండగా.. త్వరలోనే కేంద్ర ప్రభుత్వానికి నివేదికను అందచేయనుందని తెలుస్తోంది.ఎన్నికలు సాధ్యమా? కాదా? ఒకవేళ నిర్వహించాలనుకుంటే ఎలాంటి రాజ్యంగ సవరణలు చేయాలి? అనే అంశాలను కోవింద్ కమిటీ పరిశీలించింది. వీటిపై ఒక నివేదికను తయారుచేసే పనిలో నిమగ్నమైంది. ఇందులో పలు సిఫార్సులు చేసింది. 2029 నాటికి జమిలీ ఎన్నికలు జరపాలంటే ఎలాంటి మార్పులు చేయాలి? రాష్ట్రాల అసెంబ్లీల పదవీకాలం పొడిగించాలంటే ఏం చేయాలి? అనే దానిపై కేంద్రానికి పలు సూచనలు చేయనున్నారు. అలాగే లోక్‌సభ, అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికలన్నింటికీ ఉమ్మడి ఓటు జాబితా ఉండాలని కోవింద్ కమిటీ సిఫార్సు చేయనుందని తెలుస్తోంది. రాష్ట్రపతి పాలన విధించడానికి ఆర్టికల్ 356, అసెంబ్లీల వ్యవధికి సంబంధించి ఆర్టికల్ 172, అసెంబ్లీల రద్దుకు సంబంధించి ఆర్టికల్ 174, లోక్‌సభ రద్దుపై ఆర్టికల్ 85, పార్లమెంట్ సభల వ్యవధికి సంబంధించి ఆర్టికల్ 83తో పాటు ప్రజాప్రాతినిధ్య చట్టంలో పలు మార్పులు చేయాలని సిఫార్సు చేసినట్లు సమాచారం.ఇప్పటికే జమిలీ ఎన్నికలపై విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రుతురాజ్ అవస్థీ ఆధ్వర్యంలోని న్యాయ కమిషన్ కేంద్రానికి పలు సూచనలు చేసింది. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు రాజ్యంగంలో కొత్త చాప్టర్‌ను చేర్చాలని సిఫార్సు చేసింది. న్యాయ్ కమిషన్ నివేదికను ఇప్పటికే కేంద్రం పరిశీలించింది. మరింతగా దీనిపై అధ్యయనం కోసం మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ నేతృత్యంలో గత ఏడాది సెప్టెంబర్‌లో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ వివిధ పార్టీలతో పాటు జడ్జీలు, మేధావులతో సమావేశమైంది. అన్ని వర్గాల నుంచి అభిప్రాయాలు స్వీకరించి రిపోర్ట్‌ను రెడీ చేసింది. మరికొద్దిరోజుల్లో ఈ రిపోర్ట్‌ను కేంద్ర ప్రభుత్వం ముందు ఉంచనుంది. ఈ నివేదిక ఆధారంగా జమిలీ ఎన్నికలపై కేంద్రం నిర్ణయం తీసుకోనుంది. 2029 మే లేదా జూన్ నెలలో దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని కేంద్రం చూస్తోంది.దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు జరపాలంటే ఎన్నికల సంఘం ముందు అనేక సవాళ్లు ఉంటాయి. ఈవీఎంలు, సిబ్బంది, భద్రత వంటివి కష్టతరంగా మారతాయి. జమిలీ ఎన్నికలు నిర్వహించాలంటే ఈవీఎంల కోసం ప్రతీ 15 ఏళ్లకు రూ.10 వేల కోట్లు ఖర్చు అవుతుందని ఈసీ అంచనా వేసింది. అలాగే ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే పర్యవేక్షణ కూడా కష్టమవుతుంది. దీంతో వీటిపై ఈసీ కూడా పరిశీలన చేపడుతోంది. రామ్‌నాథ్ కమిటీ ఈసీకి ఎలాంటి సిఫార్సులు చేస్తుందనేది కీలకంగా మారింది.ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికల కోసం దేశవ్యాప్తంగా సుమారు 11.8 లక్షల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని ఈసీ అంచనా వేసింది. ఈ నేపథ్యంలో దేశ వ్యాప్తంగా ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాల్సి వస్తే ప్రతి పోలింగ్ స్టేషన్‌కు రెండు సెట్ల ఈవీఎంలు (ఒకటి లోక్‌సభ స్థానానికి, మరొకటి అసెంబ్లీ నియోజకవర్గానికి) అవసరమవుతాయని తెలిపింది. పని చేయని ఈవీఎంల స్థానంలో నిర్దిష్ట సంఖ్యలో అదనపు ఈవీఎంలతోపాటు ఈవీఎంల సంఖ్యకు అనుగుణంగా కంట్రోల్ యూనిట్లు (సీయూలు), బ్యాలెట్ యూనిట్లు (బీయూలు), ఓటర్-వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వీవీపీఏటీ) మెషిన్లు అవసరమని ఈసీ పేర్కొంది.మరోవైపు వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని ఏకకాల ఎన్నికలకు అవసరమైన కనీస ఈవీఎంలతోపాటు 46,75,100 బీయూలు, 33,63,300 సీయూలు, 36,62,600 వీవీపీఏటీలు అవసరమవుతాయని ఈసీ తెలిపింది. 2023 నాటి రేట్ల ప్రకారం బీయూ ధర రూ. 7,900, సీయూ ధర రూ. 9,800, వీవీపీఏటీ యూనిట్ రూ. 16,000 కలుపుకుని ఒక్కో ఈవీఎం యూనిట్ ధర రూ.33,700గా అంచనా వేసింది.కాగా, అదనపు పోలింగ్ బూత్‌ల ఏర్పాటు, భద్రతా సిబ్బంది, ఈవీఎంల భద్రతా స్థలాలు, వాహనాలు కూడా అవసరమని ఈసీ తెలిపింది. అలాగే రాజ్యాంగంలోని ఐదు ఆర్టికల్స్‌ను సవరించాలని పేర్కొంది. ఈ స్థాయిలో ఈవీఎంలు సమకూర్చుకుని ఆ మేరకు ఏర్పాట్లు చేసుకుంటే 2029లో దేశవ్యాప్తంగా ఏక కాలంలో ఎన్నికలు నిర్వహించవచ్చని వెల్లడించింది. ఒకే దేశం, ఒకే ఎన్నికకు సంబంధించి న్యాయ మంత్రిత్వ శాఖ అడిగిన ప్రశ్నలకు గత ఏడాది ఫిబ్రవరిలో ఈ మేరకు ఈసీ నివేదిక ఇచ్చింది.

# సామాజిక ఉద్యమకారిణి సావిత్రి పూలే



మహిళా హక్కులే మానవ హక్కులని తొలిసారిగా నినదించి నది సావిత్రిబాయి పూలే. కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, అస్పృశ్యుల, మహిళల సకల హక్కుల కోసం పోరాటం సల్పిన అభ్యుదయ వాది ఆమె. కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమ మూర్తి. సమాజపు కట్టు బాట్లను, బ్రాహ్మణవాద సంప్రదాయాలను, ఆధిపత్య వర్గాలను ధిక్కరించి భారత దేశపు మొట్ట మొదటి ఉపాధ్యాయు రాలుగా పాఠశాలలు ప్రారంభించిన ధీశాలి. అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన సమ న్యాయవాది. మహిళా శిరోముండ నానికి వ్యతిరేకంగా పోరాడిన సాంప్రదాయ వ్యతిరేకి. భర్త పూలే చితికి తానే స్వయంగా నిప్పుపెట్టి కొత్త సంప్రదాయానికి తెరలేపిన సంస్కరణ వాది. భారతదేశ చరిత్రలో భర్త చితికి భార్య నిప్పు పెట్టిన తొలి సంఘటన ఇదే. సావిత్రి పూలే (3 జనవరి 1831- 10 మార్చి 1897) గొప్ప సంఘ సంస్కర్త, నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతీరావ్ పూలే భార్య. ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన ఆమె తన భర్తతో కలసి 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించారు.

కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, అస్పృశ్యుల, మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయటం తమ సామాజిక బాధ్యతగా ఆ దంపతులు విశ్వసించారు. నూతన వ్యవస్థ కోసం, ప్రాణాల్ని సైతం ఫణంగా పెట్టి సమాజంలోని కులతత్వం, పురుషాధిక్యత ధోరణులకు వ్యతిరేకంగా సమష్టిగా పోరాటం చేసారు. కలిగిన చాలామందికి ఆమె కేవలం జ్యోతిరావు పూలే భార్యగా మాత్రమే తెలుసు. కానీ ఆమె ఆధునిక భారత దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు. పీడిత ప్రజలు ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి. సావిత్రీ బాయి మహారాష్ట్ర సతారా జిల్లాలో నయాగావ్ అనే గ్రామంలో 1831 జనవరి 3 న ఒక రైతు కుటుంబంలో జన్మించారు. ఆమె కుటుంబానికి తెలంగాణ ప్రాంతంతో బంధుత్వం ఉంది. బంధువులు నిజామాబాద్ జిల్లా లో బోధన్, నాందేడ్ కొండల్ వాడి ప్రాంతంలో , అదిలాబాద్ ప్రాంతపు చుట్టుపక్కల మున్నూరు కాపులు వారికి చుట్టాలు. మె తన 9వ యేట 12 ఏళ్ళ జ్యోతిరావు పూలెను 1840లో వివాహ మాడారు. నిరక్షరాస్యురాలిగా ఉన్న ఆమెకు భర్త జ్యోతిరావు పూలే మొదటి గురువు. భర్త ప్రోత్సాహంతోనే ఇంట్లోనే అక్షరాభ్యాసం చేసి విద్యావంతు రాలైనారు. అహ్మద్ నగర్ లో ఉపాధ్యాయ శిక్షణ పొంది 1848 లో భర్త జ్యోతిరావుతో కలిసి క్రింది కులాల బాలికల కోసం పూణేలో మొదటి పాఠశాలను ప్రారంభించారు. ఆ పాఠశాల నడపటం ఉన్నత, అగ్రవర్ణాలకు నచ్చలేదు. దీంతో ఆమెపై వేధింపులకు, భౌతిక దాడులకు పూనుకున్నారు. పాఠశాలకు నడిచే దారిలో ఆమెపై బురద చల్లడం, రాళ్లు విసరడం, అసభ్య పదజాలాన్ని వాడటం వంటివి చేశారు. బురదతో మలినమైన చీరను పాఠశాలకు వెళ్లిన తరువాత మార్చుకుని, మరలా వచ్చేటప్పుడు బురద చీరను కట్టుకుని వచ్చే వారు. ఎవరైనా అడిగినప్పుడు ధైర్యంగా “నా విధిని నేను నిర్వహిస్తున్నాను” అని చెప్పే వారు. ఆమె సాగించిన విద్యా ఉద్యమానికి తక్కువ సమయం లోనే సహకారం గుర్తింపు లభించాయి. ఒక ముస్లిం వ్యక్తి తన ఇంటిని బడికి కేటా యించాడు. కొంత మంది పుస్తకాలు సేకరించారు. మోరోవిఠల్, వాల్వేకర్, దియోరావ్ వంటి ప్రముఖులు పాఠశాల నిర్వహణకు సహకరించారు. 1851లో మరో పాఠశాల ప్రారంభించారు. ఉపాధ్యాయురాలిగా అట్టడుగు వర్గాలు, మహిళలకు చదువు లాంటి హక్కులు నిరాకరింపబడిన దేశంలో ఆనాటి సమాజపు కట్టుబాట్లను, సనాతన సంప్రదాయాలను, ఆధిపత్య వర్గాలను ధిక్కరించి భారతదేశపు మొట్టమొదటి ఉపాధ్యాయు రాలుగా పాఠశాలలు ప్రారంభించి,12 మే 1848న దేశంలో బహుజనులకు మ్నెట్టమ్నెదటి పాఠశాల ప్రారంభించారు. సమాజంలో ఎన్ని అవమానాలు ఎదురైనా మడమ తిప్పని ధీశాలి ఆమె. కేవలం 4 సంవత్సరాలలోనే గ్రామీణ ప్రాంతాల్లో 20 పాఠశాలలను ప్రారంభించి ఉచిత విద్యను అందించారు. దళితుల, స్త్రీల విద్యా వ్యాప్తికి కృషి ప్రారంభించే నాటికి ఆమె వయస్సు 18 ఏళ్ళు మాత్రమే. ఆమె జీవిత కాలంలో మొత్తం 52 పాఠశాలలు ప్రారంభించారు. అయితే ఈ క్రమంలో అనేక దాడులను, అవమానాలను ఎదుర్కొనడమే కాక, 1849లో పూలే, సావిత్రీబాయి దంపతు గృహ బహిష్కారానికి గురి అయినారు. సామాజిక విప్లవకారిణిగా ఆమె మానవ హక్కుల గురించి ఇతర సామాజిక సమస్యల గురించి స్త్రీలను చైతన్య పరచడానికి 1852లో మహిళా సేవామండల్ పేరున మహిళా సంఘాన్ని కూడా స్థాపించింది. లింగ సమస్యలకు తోడుగా, కుల పితృస్వామ్య వ్యవస్థల అణచి వేతకు వ్యతిరేకంగా స్త్రీల సాధికారిత కోసం ఆ సంస్థ కృషిచేసింది. కులవ్యవస్థగా నిర్మాణమైన సమాజంలో సత్యాన్ని శోధించడానికి 1873 లో తన భర్త మహాత్మా పూలేతో కలసి “సత్యశోధక్ సమాజ్ “ను ప్రారంభించి బాల్య వివాహాలకు, మూఢ నమ్మకాలకు, సతీ సహగమనానికి వ్యతిరేకంగా, వితంతువు పునఃర్వివాహల కొరకు అసమాన వ్యవస్థకు వ్యతి రేకంగా బలమైన ఉద్యమం నడిపారు. బాల్యం లోనే వైధవ్యాన్ని అనుభవించే ఎంతో మంది ఆడపిల్లలకు అన్నం పెట్టి ఆశ్రయం కల్పించారు. గర్భవతులైన వారికి పురుళ్లు పోసి వారి కళ్లల్లో వెలుగు చూసారు. అలా పురుడు పోసుకుని తన వద్దేవదిలేసి పోయిన ఓ బిడ్డను అక్కున చేర్చుకున్నారు. యశ్వంత్ గా నామకరణం చేసి తమ ఆశయాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా పెంచి పెద్ద చేసారు. వితంతువులకు శిరోముండనం చేయడాన్ని తీవ్రంగా ఖండించి, క్షురకులను చైతన్య పరిచి వితంతువుల కు శిరో ముండనం చేయబోమంటూ క్షురకుల చేత 1860లో సమ్మె చేయించారు. తరువాత 1873 సెప్టెంబరు 24న “సత్యసోధక్ సమాజ్” అనే సామాజిక, ఆధ్యాత్మిక సంస్థను ప్రారంభించి, ఉద్యమాన్ని నడిపారు. ఆ సత్యసోధక్ సమాజ్ మహిళా విభాగం సావిత్రీబాయి నేతృత్వంలో నడిచేది. వివాహాలు వంటి శుభ కార్యాలను పురోహితులు లేకుండా నిర్వహించే విధానాన్ని ఈ సంస్థ ప్రారంభించింది. 1873 డిసెంబరు 25న భార్యను కోల్పోయిన ఒక యువకునికి తన స్నేహితురాలి కుమార్తెతో సత్యసోధక్ సమాజ్ ఆధ్వర్యన సావిత్రీబాయి వివాహం జరిపించారు.1868 నుంచి సావిత్రీబాయి అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాడారు. 1870లో ఒకసారి 1896లో మరోసారి దేశంలో తీవ్ర దుర్భిక్షం ఏర్పడి నప్పుడు పూలే దంపతులు చేసిన కృషి అనన్య సామాన్యం. కరువు వాతపడిన కుటుంబాల లోని అనాథ బాలలను దాదాపు 2,000 మందిని అక్కున చేర్చుకున్నారు. తమ పాఠశాల ల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించా రు. సావిత్రిబాయి సంఘ సంస్కర్తగానే గాదు, రచయిత్రిగా కూడా పేరెన్నిక గన్నా రు. 1854లోనే ఆమె తన కవితా సంపుటి ‘కావ్యఫూలే’ను, మరో కవితా సంపుటి ‘పావన కాశీ సుభోధ్ రత్నాకర్’ను 1891లో ప్రచురించారు. ఆమె ఉపన్యాసాల్లో కొన్ని 1892లో పుస్తక రూపంలో వచ్చాయి.జ్యోతీరావు పూలే 1890 నవంబరు 28న మరణించడంతో సావిత్రీబాయి అంతులేని దుఃఖ సాగరంలో మునిగి పోయి కూడా, దుఃఖంలోనుంచే మరో ఆదర్శానికి శ్రీకారం చుట్టారు. తన భర్త పూలే చితికి తానే స్వయంగా నిప్పుపెట్టి కొత్త సంప్రదాయానికి తెరలేపారు. భారతదేశ చరిత్రలో భర్త చితికి భార్య నిప్పు పెట్టిన తొలి సంఘటన ఇదే. పూలే మరణాంతరం సత్యసోధాక్ సమాజ్ భాధ్యతను స్వీకరించి నడిపించారు. 1897 లో ప్లేగు వ్యాధి, పూణే నగరాన్ని వణికించింది. నగరమంతా ఎడారిగా మారింది. జనమంతా దగ్గర్లోని అడవుల్లోకి పారిపోయారు. అయినా సావిత్రీబాయి పూలే కొడుకు యశ్వంత్ తో కల్సి వ్యాధి గ్రస్తులకు సేవ చేసారు. 1896-97లో సంభవించిన తీవ్ర కరువు, ప్లేగు వ్యాధి మహారాష్ట్ర జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. ఈ పరిస్థితుల్లో కరువు ప్రాంతాల్లోని దళితులు పేదలకు జోలెపట్టి విరాళాలు సేకరించి అందించారు. ప్లేగువ్యాధి సోకిన పేదలకు దగ్గరుండి సేవలందించారు. 1890వ దశకంలో ప్లేగు వ్యాధి బారినపడిన పిల్లల కోసం వైద్య శిబిరాలు నిర్వహించారు. దుర్భరమైన కరువు పరిస్థితుల్లో కూడా రోజుకు 2 వేల మంది పిల్లలకు భోజనాలు పెట్టించారు. ప్లేగు వ్యాధి సోకిన మాంగ్ లాంటి కులాలకి చెందిన దళిత చిన్న పిల్లలని తన చంకన వేసుకొని చికిత్స చేసి కాపాడారు. చివరికి ఆ ప్లేగు వ్యాధే ఆమెకు సోకి మార్చి 10, 1897 లో మరణించారు. ఆమె దత్తపుత్రుడు యశ్వంత్ అంత్యక్రియలు జరిపించాడు. సావిత్రి బాయి జయంతిని భారతదేశ “మహిళా ఉపాధ్యాయుల దినోత్సవం”గా జరుపు కుంటారు. 1997లో భారత ప్రభుత్వం సావిత్రిబాయి జ్ఞాపకార్థం తపాలా స్టాంపును విడుదల చేసింది. పూణే విశ్వ విద్యాలయానికి సావిత్రిబాయి పేరు పెట్టారు

# అద్భుత ఆవిష్కరణ దూరవాణి



నేడు మనం వాడుతున్న ఫోన్లకు మాతృక అయిన “టెలిఫోన్” అనేదాన్ని కనిపెట్టింది అమెరికాకు చెందిన “అలెగ్జాండర్ గ్రాహెంబెల్” అని మనలో చాలామందికి తెలిసే ఉంటుంది. టెలీ ఫోను అంటే... టెలీ అనగా దూర, ఫోను అంటే వాణి... దూరవాణి అని అర్థం. ఇది సాధారణంగా ఇద్దరు, మరికొన్ని సమయాలలో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది సంభాషించు కునేందుకు ఉపయోగిస్తుంటారన్న సంగతి మనకు తెలిసిందే. అలెగ్జాండర్ గ్రాహెంబెల్ స్కాట్లాండులోని ఎడిన్‌బర్గ్ అనే ప్రాంతంలో మార్చి 3, 1847వ సంవత్సరంలో జన్మించాడు. ఆయన తండ్రి పేరు అలెగ్జాండర్ మెల్‌విల్లే బెల్ (ప్రొఫెసర్) కాగా, తల్లి పేరు ఎలిజా గ్రేస్ గ్రాహెంబెల్. చిన్న వయసు నుంచే సహజంగానే అనేక విషయాల పట్ల ఆసక్తి ఎక్కువగా ఉండేది. ముఖ్యంగా గ్రాహెంబెల్ కు ఆ రోజుల్లోనే పరిశీలనా శక్తి అధికంగా ఉండేది. తన పక్కింట్లో నివాసముండే తన స్నేహితుడు బెన్ హెర్డ్‌మెన్ సహాయంతో గ్రాహెంబెల్ 12 ఏళ్ల ప్రాయంలోనే “ఇన్వెంట్” అనే పేరుతో చిన్న వర్క్‌షాప్‌ను నిర్వహించాడు. తల్లి క్రమేణా వినికిడి శక్తిని కోల్పోవడంతో ఆమెతో మాట్లాడే క్రమంలో సంజ్ఞలతో భావ వ్యక్తీకరణలో ఆరితేరాడు. ఆమె నుదిటి ఎముకకు దగ్గరగా ఒక రకమైన ఉచ్చారణతో మాట్లాడే ప్రయత్నంలో ధ్వని శాస్త్రాన్ని అర్థం చేసుకున్నాడు. బెల్‌లోని విజ్ఞాన తృష్ణకు తల్లి చెవిటితనం కూడా ఓ కారణం.

ఆపై ఎడింబరో విశ్వ విద్యాలయంలో ధ్వని, వినికిడి శాస్త్రాలు చదివి అమెరికాలోని బోస్టన్ విశ్వ విద్యాలయంలో ‘గాత్ర సంబంధిత శరీర శాస్త్రం’ (వోకల్ ఫిజియా లజీ)లో ప్రొఫెసర్‌గా చేరాడు. భార్య సైతం వినికిడి శక్తిని కోల్పోవడంతో బధిరుల కోసం పరిశోధనలు చేసి, వారు వినగలిగే శబ్ద పరికరాలను రూపొందించాడు. పగలంతా బోధిస్తూ, రాత్రంతా మేలుకుని ప్రయోగాలు చేసేవాడు. ఆ కృషి కారణంగానే తీగల ద్వారా శబ్ద తరంగాలను పంపగలిగే టెలిఫోన్‌ను కనిపెట్ట గలిగాడు.లోహపు తీగ చుట్టబడిన ఒక శాశ్వత అయస్కాంతం దగ్గర పల్చని ఇనుప రేకును కంపింపజేస్తే, కంపనాల తీవ్రతకు అనుగుణంగా తీగలో విద్యుత్ ప్రవాహం ఏర్పడు తున్నట్లు బెల్ కనుగొన్నా డు. శబ్దాన్ని ప్రసారం చేయటానికి ఈ సిద్ధంతం బాగా ఉపకరిస్తుందని గ్రహించాడు. థామస్ వాట్సన్ అనే మెకానిక్ తో బాటు దీనికి సంబంధించిన ప్రయోగాలు చేసుకుంటూ అతడు పచ్చిక బయళ్ళలో, మైదానాల్లో, బీడు భూముల్లో తిరుగుతుండే వాడు. జీవితంలో ఎన్నో ఒడిదుడు కులు, అపజయం వెక్కిరించాయి. ప్రోత్సహించేవారు కరువయ్యారు. ఎటు చూసినా నిరాశా నిస్పృహలే తారసిల్లాయి. టెలిఫోన్ ద్వారా నోటిమాటల్ని దూర ప్రదేశాలకు అందించే కృషి చేస్తున్నానని చెబితే నలుగురు నవ్విపోతారేమో అని భయ పడుతూ అజ్ఞాతంగా కాలం గడిపేవాడు. కాబోయే మామ కూడా ఇది అంతా ఒక పగటి కల అని కొట్టి పారేశాడు. 1875 జూన్ లో ఒకరోజు వర్క్ షాప్ కి ఇటూ, అటూ ఉన్న రెండు గదుల్లో ప్రసారిణి, రిసీవర్‌లను వుంచి వెల్, వాట్సన్ ప్రయోగాలు చేస్తుండగా ఒకదాని ఇనుపరేకు అయస్కాంతా నికి అతుక్కు పోయింది. దాన్ని లాగాలని వాట్సన్ ప్రయత్నించినపుడు బెల్ వద్ద వున్న ఇనుపరేకు కూడా కంపించసాగింది. ఇనుపరేకు దగ్గర చెవి ఉంచగా శబ్దం కూడా వినబడింది. ఒక పక్క ఇనుపరేకును అయస్కాంతానికి చాలా దగ్గరగా ఉంటే ప్రయోగ ఫలితాలు సంతృప్తి కరంగా ఉంటాయని వాళ్ళు గ్రహించారు. ఇలా కొన్ని నెలలు కృషి చేశాక మొదటి పటిష్ఠమైన టెలిఫోన్ నిర్మించారు. బాటరీ అవసరం లేకుండా ప్రసారిణిలో ఉత్పత్తి అయ్యే అల్ప విద్యుత్ వల్లనే ఇది పనిచేయసాగింది. 1876 మార్చి 10న టెలిఫోన్ ప్రసారిణి బెల్ ఇంటి రెండో అంతస్తు లోనూ, రిసీవర్ ని మొదటి అంతస్తు లోనూ, అమర్చి బెల్ ఫోన్ లో ఇలా మాట్లాడాడు -“మిస్టర్ వాట్సన్, మీతో పనుంది, పైకి రండి” -. ఫోన్‌లో మాట్లాదిన తొలి పలుకులుగా ఈ పదాలు ప్రసిద్ధి కెక్కాయి. ఒకటి రెండు నిముషాల్లో మెట్లెక్కి రొప్పుతూ, రోజుతూ వాట్సన్ బెల్ వద్దకు పరుగెత్తి వచ్చి “ఫోన్ పని చేస్తుంది. మీ మాటలు నాకు వినబడ్డాయి.” అని అరిచాడు. ఇలా కనిపెట్టినదే టెలిఫోను. దీనిని 1876 మార్చి 10న గ్రాహెంబెల్ మొదటిసారిగా ఉపయోగిస్తూ, వాట్సన్‌తో మాట్లాడారు. దీనిపై 1876లో ఆయనకు లభించిన పేటెంట్ అమెరికాలోనే శాస్త్రరంగంలో మొదటిది. గ్రహంబెల్ ను చాలామంది టెలిఫోన్ ఆవిష్కర్తగా గుర్తుంచుకున్నా ఆయన వివిధ రంగాలలో ఆసక్తిని కనబరచాడు. ఆప్టికల్ టెలి కమ్యూనికేషన్స్, హైడ్రోఫాయిల్స్, ఏరోనా టిక్స్ రంగాల్లో కూడా అనేక ఆవిష్కరణలు చేశాడు. నేషనల్ జియోగ్రాఫిక్ సొసైటీ వ్యవస్థాప కుల్లో గ్రాహంబెల్ కూడా అయన ఒకరు. 1880 వ సంవత్సరంలో టెలిఫోన్ ఆవిష్కరణకు గాను ఫ్రెంచి ప్రభు త్వం ప్రధానం చేసే వోల్టా పురస్కా రాన్ని గెలుచుకున్నాడు. దీని విలువ 50,000 ఫ్రాంకులు ( సుమారు 10,000 డాలర్లు). తన జీవిత కాలమంతా రకరకాల పరిశోధనలతో గడిపిన గ్రాహెంబెల్ తన 75 సంవత్సరాల వయసులో చక్కెర వ్యాధికి గురై, 1922 ఆగస్టు 2వ తేదీన మరణించాడు.

# స్థానిక వార్తలు

## భారత జాగృతి కమిటీలు రద్దు



భారత జాగృతి కమిటీలన్నీ రద్దయ్యాయి. విదేశీ, జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామస్థాయి కమిటీలన్నింటినీ రద్దు చేస్తున్నట్లు భారత్ జాగృతి అధ్యక్షురాలు కవిత కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. కమిటీల రద్దు తక్షణం అమలులోకి వస్తుందని కార్యాలయంలో పేర్కొంది. అయితే, కమిటీల రద్దుకు సంబంధించి కారణాలు తెలియరాలేదు.

## భట్టి విక్రమార్క నా మీద పగ పట్టిండు.. కన్నీరు పెట్టుకున్న వీ హనుమంతరావు



**హైదరాబాద్ :** ఖమ్మం ఎంపీ టికెట్ రాకుండా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తన మీద పగ పట్టిండు, కక్ష పెంచుకున్నాడని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీ హనుమంతరావు కన్నీరు పెట్టుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో వీహెచ్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ దయవల్లే ఈ స్థాయికి ఎదిగాను అని వీహెచ్ స్పష్టం చేశారు. గత ఏడు, ఎనిమిది ఏండ్ల నుంచి తనకు ఎలాంటి పదవి ఇవ్వలేదు. క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ లేదు.. స్టార్ క్యాంపెయిన్‌లో చోటు ఇవ్వలేదు. అయినప్పటికీ తనకు ప్రజల్లో అభిమానం ఉంది. ఎవరు తనకు వ్యతిరేకం చేసిన ఆ భగవంతుడు ఉన్నాడని వీహెచ్ పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి పార్టీ కోసం కష్టపడ్డారు.. ఆయనే సీఎం కావాలన్నాను.. అందులో తప్పేముంది..? పార్టీ బలోపేతానికి రేవంత్ ఎంతో కృషి చేశారు. న్యాయ యాత్ర చేస్తున్న రాహుల్ గాంధీ దీన్ని గమనించి తనకు న్యాయం చేయాలి. హెలికాప్టర్‌లో రేవంత్ రెడ్డి తిరిగితే.. తాను కార్లలో తిరిగి ప్రచారం చేశాను. భారతదేశంలో హనుమంతరావు అంటే తెలియని వారు లేరు. భట్టి విక్రమార్క సీఎల్పీ స్థాయికి ఎదిగేందుకు తన సహాయం కూడా ఉంది. రాజకీయంగా అంచెలంచెలుగా ఎదిగేందుకు భట్టి విక్రమార్కకు తాను సహాయం చేస్తే.. ఇవాళ్నేమో ఆయన తనను వ్యతిరేకిస్తున్నారు. ఖమ్మం టికెట్ వస్తే తప్పకుండా గెలుస్తా. రాజీవ్ గాంధీ ఆలోచనను ఇంప్లీమెంట్ చేస్తాను. ఖమ్మం ప్రజలు తనను కోరుకుంటున్నారు. బీసీలు అవసరం లేదా..? బీసీలు ఓట్లు వేసే మేషిన్లమా.. న్యాయం జరగదా..? తాను ఎంతో మందికి సహాయం చేశాను. రాజశేఖర్ రెడ్డిని పీసీసీ ప్రెసిడెంట్‌గా చేసింది కూడా తానేనని వీ హనుమంతరావు పేర్కొన్నారు.

## ఆస్ట్రేలియాలో హైదరాబాద్ మహిళ దారుణ హత్య



ఆస్ట్రేలియాలో హైదరాబాద్‌కు చెందిన మహిళ దారుణ హత్యకు గురైంది. భర్త అశోక్ రాజ్ భార్య శ్వేతను హతమార్చాడు. విక్టోరియాలోని బక్లీలో ఈ ఘటన చోటు చేసుకుంది. రోడ్డు పక్కన ఉన్న ఓ చెత్తడబ్బాలో శ్వేత మృతదేహాన్ని అక్కడి పోలీసులు గుర్తించారు. భార్యను చంపిన తర్వాత కుమారుడిని తీసుకుని అశోక్ హైదరాబాద్ వచ్చాడు. అత్తగారింట్లో కొడుకుని వదిలిపెట్టి తిరిగి ఆస్ట్రేలియా వెళ్లిపోయాడు. కేసును దర్యాప్తు చేసిన విక్టోరియా పోలీసులు.. అశోక్ రాజే శ్వేతను హతమార్చినట్లు నిర్ధారించారు. ప్రస్తుతం అశోక్ రాజ్‌ను అరెస్టు చేసినట్లు సమాచారం.

## సిరిసిల్ల జిల్లాలో విషాదం.. నలుగురు రైతులకు కరెంట్ షాక్



**రాజన్న సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. నలుగురు రైతులు కరెంట్ షాక్‌కు గురయ్యారు. వీరిలో ఒకరు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. బావుసాయిపేట గ్రామానికి చెందిన ఉష్కల రోశయ్య అనే రైతు పొలంలో బోరు మోటారు దించేందుకు నలుగురు రైతులు వచ్చారు. బోరు మోటారు దించుతుండగా.. నలుగురు రైతులకు కరెంట్ షాక్ తగిలింది. అపస్మారకస్థితిలోకి వెళ్లిన ఈ నలుగురిని 108 అంబులెన్స్‌లో వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. నలుగురిలో ఒకరు మృతి చెందారు. కర్నాల శ్రీనివాస్, కర్నాల మహిపాల్, పంబల రాజు అనే ముగ్గురు రైతుల పరిస్థితి విషమంగా ఉంది. మృతుడిని పంబల భూమయ్య(33)గా పోలీసులు గుర్తించారు. మృతుడి కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతులను జడ్పీ చైర్ పర్సన్ అరుణ పరామర్శించారు.

# మహిళలు పారిశ్రామికవేత్తలుగా మారాలి

**ఐదేళ్లలో డ్వాక్రా సంఘాలకు లక్ష కోట్ల నిధులు**
**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**




**వాస్తవ నేస్తం,మధిర:** రాష్ట్రంలో ఇల్లు లేకుండా ఏ కుటుంబం ఉండరాదనేది ఇందిరమ్మ రాజ్యం లక్ష్యమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం మధిర నియోజకవర్గం చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3500 చొప్పున మొదటి దశలో ఇవ్వనున్నట్టు తెలిపారు. ప్రతి లబ్ధిదారునికి ఐదు లక్షల రూపాయలు ఆర్థిక సాయం అందుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం గత పది సంవత్సరాలుగా రాష్ట్రంలోని ప్రజలు చూసి చూసి అలసిపోయారని తెలిపారు. ఇది చాలా బాధాకరం అన్నారు. రాష్ట్రంలోని అర్హులందరినీ గుర్తించి లబ్ధి చేకూరుస్తామన్నారు. ఈనెల 11న సీఎం రేవంత్ రెడ్డి గారు భద్రాచలంలో ఈ కార్యక్రమాన్ని శ్రీకారం చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలోని ద్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు అందించాలని నిర్ణయించాము. ఈ నెల 12న హైదరాబాదులో లక్షలాది మంది మహిళలతో భారీ సభ నిర్వహించి వడ్డీ లేని రుణాలకు తిరిగి శ్రీకారం చుడుతున్నట్టు తెలిపారు. ద్వాక్రా మహిళలు చిన్న చిన్న వ్యాపారాలకి పరిమితం కాకుండా వారు పారిశ్రామిక వేత్తలు గా ఎదిగేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు వివరించారు. రాష్ట్ర విభజన నాటికి మనది ధనిక రాష్ట్రము. కానీ గత పాలకులు ఇందిరా క్రాంతి పథం ఐకేపీ ని అట కెక్కించరని ఎద్దేవా చేశారు.

# వాస్తవ నేస్తం ఎఫెక్ట్..

## - యుద్ధ ప్రాతిపదికన గుంతలు పూడ్చివేత పనులు


ఈ రోడ్డుకు మోక్షం వచ్చేనా...?

వాసవ నేస్తం,ముథోల్: ముథోల్ నుండి విట్టోలి వెళ్లే రోడ్డుపై పూర్తిగా గుంతలు ఏర్పడడంతో వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ముథోల్ మండల కేంద్రం నుండి వివిధ గ్రామాలకు నుండి లోకేశ్వరం మండలం పంచగుడి గ్రామం వరకు గుంతల మయం అవడంతో రాకపోకలు సాగించడానికి ప్రజలు నానా అవస్థలకు గురవుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, చిన్నపాటి వాహనాలు రోడ్డుపై నుండి ప్రయాణించడానికి పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



**వాస్తవ నేస్తం,ముధోల్(ఆర్సి):** ముధోల్ నుండి విట్టోలి గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతల మాయం అవ్వడంతో ఈ రోడ్డుకు మోక్షం వచ్చినా..? అనే శీర్షికన ఈనెల ఏడవ తేదీన వాస్తవ నేస్తం దినపత్రికలో ప్రచురితమైంది. దీంతో స్పందించిన సంబంధిత అధికారులు యుద్ధ ప్రతిపాదికన రోడ్డు మరమ్మతు పనులు చేపట్టి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించారు. ముధోల్ నుండి విట్టోలి గ్రామానికి రాకపోకలు ప్రయాణికులు కొనసాగిస్తున్నారు. వాస్తవ నేస్తం దినపత్రికలో ప్రచురించిన కథనంతో రోడ్డుకు మరమ్మతులు జరగడంతో ప్రయాణికులు, వాహనదారుల ఇబ్బందులు తొలిగాయి.

# ప్రభుత్వ బోరు నీటిని వ్యవసాయ అవసరాల కోసం వాడుకుంటున్న వారిపై పై కఠిన చర్యలు తీసుకోవాలి



**వాస్తవ నేస్తం,అనంతగిరి:** మండలంలోని పాత గోల్కొండ గ్రామపంచాయతీ పరిధిలోని మీడియా తండాలో ప్రభుత్వ బోరు నీటిని వ్యవసాయ అవసరాల కోసం వాడుకుంటున్న వారిపై పై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బాణోత్ బాబు నాయక్ డిమాండ్ చేశారు. శృంగారం క్రాస్ రోడ్డు వద్ద ప్రయాణికులు తాగునీటి అవసరాలకు ప్రభుత్వం చేతికి పంపడం ఏర్పాటు చేసిందాని, ఆ బోరుబావికి ఉన్న చేత పంపను తీసి గ్రామ పల్లె ప్రకృతి వనానికి నీటిని అందిస్తున్నారని, పల్లె ప్రకృతి వనానికి వెళుతున్న పైప్లైన్ నుంచి మరొక పైప్ లైన్ ఏర్పాటు చేసి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలోకి ఓ రైతును నీటిని వాడుకుంటున్నాడని గ్రామాల్లో తాగునీరు లేక ప్రజల ఇబ్బందులు పడుతుంటే, అక్రమంగా భావి నింపు కుంటున్న వారికి కార్యదర్శి సహకరిస్తున్నారని ఆరోపించారు. పంచాయతీ కార్యదర్శి పై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇదిలా ఉండగా నెలరోజుల క్రితం బోరు నుంచి పక్కకు పెట్టిన చేతిపంపును గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు అధికారులు చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. పై విషయాల పై ఎంపీడీవో ని వివరణ కోరగా ఇప్పటివరకు ఆ విషయాలు తమ దృష్టికి రాలేదన్నారు.

## ఇసుక తరలిస్తున్న వాహనం పట్టివేత




**వాస్తవ నేస్తం,కోటగిరి:** ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. పోతంగల్ మండలం హెగ్డోలి గ్రామ శివారులో ఇసుక తరలిస్తున్న వాహనాన్ని పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించిన ఎస్సై సందీప్ తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## 'షెడ్యూల్'కు ముందే హవాలా హల్‌చల్! ఇప్పటికే రెండు కేసులు నమోదు

**ఎన్నికల తేదీలు ఖరారైతే**
**విజృంభించనున్న హవాలా రాకెట్లు**

**హైదరాబాద్ :** ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల అయిన 24గంటల వ్యవధిలోనే రంగంలోకి దిగిన హవాలా గ్యాంగులు.. పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఇంకాస్త ముందంజలో ఉన్నట్లు కనిపిస్తున్నారు. అప్పట్లో 24గంటల్లో 5 కేసులు నమోదయ్యాయి. అయితే, పార్లమెంట్ ఎన్నికల తేదీలు ఖరారు కాకముందే హవాలా ఏజెంట్లు ట్రయల్స్ చేపట్టారో లేక ఎన్నికలకు సంబంధించిన డబ్బును తరలిస్తున్నారో కానీ.. రెండురోజుల్లో నగరంలో రెండు కేసులు వెలుగులోకి వచ్చాయి. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఓటీ అధికారులు చేపట్టిన తనిఖీల్లో రూ. 50లక్షలు దొరికాయి. రియల్ ఎస్టేట్ డబ్బులని, మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు ఆ వ్యక్తి చెప్పడం గమనార్హం. మరుసటి రోజు మేడ్చల్ పరిధిలో ముగ్గురు వ్యక్తుల నుంచి రూ.19లక్షల హవాలా డబ్బును బాలానగర్ ఎస్ఓటీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎంత డబ్బు చేతులు మారుతుందో వేచి చూడాల్సిందే. పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని వేల కోట్ల రూపాయలు ఇట్టే చేతులు మారే అవకాశముంది. మరోవైపు హవాలా డబ్బును అడ్డుకోవడానికి మూడు కమిషనరేట్లలో పోలీసులు కూడా అదే స్థాయిలో సిద్ధమవుతున్నారు. ఇప్పటికే నగర శివారు ప్రాంతాల్లో, కమిషనరేట్ల సరిహద్దుల్లో చెక్‌పోస్టులు కూడా వెలిశాయి.

# తెలంగాణ ఉద్యమం నుంచి వచ్చిన బిడ్డను నేను.. రేవంత్‌కు కేటీఆర్ గట్టి కౌంటర్

**కామారెడ్డి :** నేను అయ్య పేరు చెప్పుకుని రాజకీయాల్లో రాలేదన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గట్టి కౌంటర్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి లాగా తాను రాంగ్ రూట్లో రాలేదని, బరాబర్ తెలంగాణ ఉద్యమం నుంచి వచ్చిన బిడ్డను అని కేటీఆర్ తేల్చిచెప్పారు. కామారెడ్డి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. రాహుల్ గాంధీ అమ్మ, అయ్య పేరు చెప్పుకోని బతుకుతుండు. అంత ఎందుకు నీ పక్కన ఉన్న శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ వాళ్ల అయ్యల పేర్లు చెప్పుకొని వచ్చారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వాళ్ల అన్న పేరు.. భట్టి విక్రమార్క వాళ్ల అన్న మల్లు అనంత రాములు పేరు చెప్పుకుని వచ్చారు. దొంగల మధ్య ఉన్న నువ్వు ఇలాంటి మాటలు మాట్లాడటం సరికాదన్నారు కేటీఆర్.




### నీలాగా రాంగ్ రూట్లో రాలేదు..

మా అయ్య పేరు కేసీఆర్.. బరాబర్ ఉద్యమం నుంచి వచ్చిన బిడ్డను నేను. మీలాగా వాళ్ల, వీళ్ల బూట్లు నాకి, సంచులు మోసి రాలేదు.. ఒక్కసారి కాదు ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచాను. నీలాగా రాంగ్ రూట్లో రాలేదు. చవుట పనులు చేసి, పార్టీలు మారి దిక్కుమాలిన పనులు చేసి రాలేదు. చేతగాని వాడినైతే మళ్లా నేను సిరిసిల్లలో గెలుస్తానా..? ఐదుసార్లు గెలిపించారు. కారు కూతలు, రోత మాటలు వద్దు.. ముఖ్యమంత్రిలాగా మాట్లాడు అని రేవంత్ రెడ్డికి కేటీఆర్ సూచించారు.

### కామారెడ్డి ఫలితం చేదు జ్ఞాపకాన్ని మిగిల్చింది..

మొన్నటి ఎన్నికల్లో కామారెడ్డి ఫలితం చేదు జ్ఞాపకాన్ని మిగిల్చింది. దాన్ని గురించి చర్చ, రాద్ధాంతం వద్దు. గతం గతః భవిష్యత్‌పై ముందు చూపు ఉండాలి. కామారెడ్డి నుంచి 5 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై అందరికీ అందుబాటులో ఉన్న గంప గోవర్ధన్ మీకు అండగా ఉన్నారు. రేపటి రోజున గంప గోవర్ధన్ నాయకత్వంలో పార్లమెంట్ ఎన్నికలకు ముందుకు పోతామని కేటీఆర్ తెలిపారు.

### తెలంగాణలో మళ్లీ పూర్వ వైభవం వస్తది..

తెలంగాణలో మళ్లీ పూర్వ వైభవం వస్తది.. మంచి రోజులు వస్తాయి. తెలంగాణ వచ్చిన తర్వాత మొదటిసారి అర్ధరాత్రి బాయికాడికి పోయే రోజులు వచ్చాయని రైతులు అంటు న్నారు. పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. గందరగోళం ఉంది. బతుకు ఆగమయ్యే పరిస్థితి వచ్చిందని రైతులు అంటున్నారు. ప్రతి పంటకు రైతుబంధు పడుతుండే.. ఇవాళ కాంగ్రెస్ గవర్నమెంట్‌లో రైతుబంధు రాలేదు.. మోటార్లు కూడా కాలుతున్నాయి.. రిపేర్లకు 2 లక్షలు ఖర్చు పెట్టామని రైతులు చెబుతున్నారు. తినే పల్లెంలో మట్టి పోసుకుంటిమి అని అందరూ అనుకుంటున్నారు అని కేటీఆర్ తెలిపారు.

### మన జైత్రయాత్ర మొదలు పెడుదాం..


మొన్న ఎన్నికల్లో ఎదురైన దెబ్బను పక్కకు పెట్టి.. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కామారెడ్డిలో తిరిగి మన జైత్రయాత్ర మొదలు పెట్టాలని కోరుతున్నాను. రకరకాల ప్రచారాలు చేసి, ఇష్టమొచ్చినట్లు నోటికొచ్చిన హామీలిచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇక్కడ బీజేపీ ఎమ్మెల్యే గెలిచిండు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 9 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. బాల్కొండ, బాన్సువాడలో గెలిచాం. బోధన్, జుక్కల్, కామారెడ్డిలో స్వల్ప తేడాతో ఓడిపోయాం. చిన్నచిన్న పొరపాట్లు, పట్టింపుల వల్ల కొంత నష్టం జరిగిన మాట వాస్తవం అని కేటీఆర్ తెలిపారు.

# వంటగదిలో చీపురును పెడుతున్నారా..



హిందూ మతంలో, చీపురు లక్ష్మీ దేవతగా పరిగణించబడుతుంది. వాస్తులో చీపురుకు ప్రత్యేక స్థానం ఉంది. ఇంట్లో చీపురు పెట్టే దిశకు ప్రత్యేక స్థానం ఉంది.అయితే చీపురును తప్పుగా వాడితే పేదరికం వస్తుందని, సాయంత్రం దీపం వెలిగించిన తర్వాత చీపురుతో ఇంటిని ఊడ్చకూడదని వాస్తు నిపుణులు అంటున్నారు. ఇది ఆర్థిక నష్టాలకు దారి తీస్తుందని మన పెద్దలు కూడా అంటుంటారు. పొరపాటున కూడా చీపురును కాలితో తొక్కకూడదు.సాధారణంగా ప్రతి ఇంట్లో చీపురు ఉంటుంది. ముఖ్యంగా, చీపురు లేకుండా ఇంటిని శుభ్రం చేయలేరు. మీరు చీపురుతో ఇంటి చుట్టూ ఉన్న చెత్తను తుడుచుకుంటారు. అయితే, చాలా మంది చీపురు ఉపయోగించడం పూర్తయ్యాక దానిని దూరంగా ఉంచుతారు. మీరు మీ ఇంటిని వాస్తు ప్రకారం నిర్మించుకోవడమే కాకుండా మీ ఇంట్లో వస్తువులను వాస్తు ప్రకారం ఏర్పాటు చేసుకోవాలి. వాస్తు శాస్త్రం ప్రకారం, ఇల్లు, వంటగది యొక్క పరిశుభ్రత ఇంటి శక్తిని ప్రభావితం చేసే ముఖ్యమైన భాగం. మేము వంటగదిలో ఆహారాన్ని సిద్ధం చేస్తాము. అక్కడ పరిశుభ్రతపై శ్రద్ధ చూపుతాం. అయితే, మీరు వంటగదిలో చీపురు ఉంచకూడదు. వాస్తు ప్రకారం, సరైన స్థలంలో ఉంచాలి. సాధారణంగా కొంతమందికి జ్యోతిష్యం మీద నమ్మకం ఉండదు. అయితే, సైన్స్ ప్రకారం చీపురు అనేది ఇంటిని శుభ్రం చేసే పరికరం. చీపురు నుండి బ్యాక్టీరియా మీ ఆహారంలోకి ప్రవేశించి దానిని కలుషితం చేస్తుంది. అలాగే వాస్తు ప్రకారం, చీపురు సరైన దిశలో పెడితే లక్ష్మి ఇంట్లోకి ప్రవేశిస్తుంది. అలాకాకుండా అన్నీ పక్కదారి పట్టిస్తే పేదరికం ఏర్పడుతుంది.

# మహాశివరాత్రి రోజున చిలగడదుంపలను ఎందుకు తింటారు?



'శివుని పట్ల తమకున్న భక్తి, ఆరాధనను తెలియజేసేందుకు దేశవ్యాప్తంగా ఎంతో మంది మహా శివరాత్రి నాడు ఉపవాసం ఉంటారు. పిల్లలు, రోగులు, వృద్ధులు ఉపవాసం ఉండవలసిన అవసరం లేదు.అయినా కూడా కొంతమంది భక్తులు కఠినమైన ఉపవాసాన్ని పాటిస్తారు. అంటే మహా శివరాత్రి నాడు కనీసం నీళ్లు కూడా తాగకుండా ఉపవాసం ఉంటారు".అయితే కొంతమంది శివరాత్రి నాడు ఉపవాసం ఉండి.. అన్నం తినకుండా స్నాక్స్ గా పలు ఐటెమ్స్ తింటుంటారు. ముఖ్యంగా చాలా మంది శివరాత్రి రోజు ఎక్కువగా చిలగడదుంపలను తీసుకుంటారు. ఈ పండుగ రోజే చిలగడదుంపలకు ఎక్కువగా ఎందుకు ప్రధాన్యతనిస్తారు. ఎందుకు తింటారో ఇప్పుడు తెలుసుకుందాం..చాలా మంది ఉపవాసం ఉన్నప్పుడు స్వీట్ పొటాటోలను సాధారణంగా తీసుకుంటుంటారు. అందులో చిలగడదుంప ఒకటి. చిలకగడదుంపలో ఎన్నో శక్తివంతమైన పోషకాలుంటాయి. స్వీట్ గా ఉండటంతో పాటు పొటాషియం, ఐరన్ మెగ్నీషియం, విటమిన్ డి, సి వంటి విటమిన్స్ పుష్కలంగా ఉంటాయి. చవకైనవి అండ్ రుచికరమైన చిలగడదుంపలను శివరాత్రి నాడు మార్కెట్‌లో ఎక్కువగా అమ్ముతుంటారు. ఎక్కువమంది వీటిని శివరాత్రి పండుగ ముందు రోజే కొనుక్కుని పెట్టుకుంటారు. పండగ నాడు ఉపవాసం సమయంలో వీటిని తక్కువ వాటర్‌లో ఉప్పు వేసి 2 విజిల్స్ వచ్చే వరకు ఉడికించి.. శివుడి వద్ద పెట్టి.. కాసేపయ్యాక తింటారు. చిలగడదుంపలు తింటే కడుపు తొందరగా నిండిన భావన కలుగుతుంది. అలాగే ఇవి ఎక్కువ సమయం పాటు ఎనర్జీగా ఉండేలా చేస్తాయి. ఆరోగ్యానికి కూడా చిలగడదుంపలు ఎన్నో ప్రయోజనాలు చేకూర్చుతాయి. కాగా మహాశివరాత్రి నాడు చాలా మంది చిలగడదుంపలను ఎక్కువగా తీసుకుంటారు.

# ముక్కులో వేలు పెట్టుకోవడం ఏ సమస్యకు దారితీస్తుందో తెలుసా?



ఒక్కొక్కరికి ఒక్కో అలవాటు ఉంటుంది. ఆ అలవాటు మంచిదైనా, చెడ్డదైనా అంత త్వరగా మానుకోలేకపోతారు. కొందరు తాము మాట్లాడే ప్రతి మాటకు ముందు లేదా వెనక ఓ ఊతపదాన్ని వాడుతుంటారు.మరికొందరు సైగలు (సంజ్ఞలు) చేస్తుంటారు. మాటిమాటికి కన్నుకొట్టడం, చేతులు అదేపనిగా ఊపడం, తల ఆడించడం తదితర అలవాట్లు ఉంటాయి. ఎక్కువ మందికి ముక్కులో వేలు పెట్టుకునే అలవాటు కూడా ఉంటుంది. ఇది కొందరికి అసభ్యంగా అనిపిస్తుంది. కానీ అత్యధికుల్లో ఈ అలవాటు ఉంటుంది. వీళ్లు ఎక్కడ ఉన్నా తమ వేలు ముక్కులోకి దూర్చేస్తుంటారు. ఇది ఎదుటి వారు చూడటానికి ఇబ్బందికరంగా ఉన్నా ఏమాత్రం పట్టించుకోరు. సహజంగా చిన్నతనంలో పిల్లలు నోట్లు వేలేసుకోవడం చూస్తూనే ఉంటాం. 5,6 ఏళ్ల వరకు దానిని మర్చిపోకున్నా.. పెద్దవుతున్నా కొద్ది ఆ అలవాటును మార్చుకుంటారు. ముక్కులో వేలు పెట్టడం కూడా అలాంటిదే. దీనిని వైద్యులు ఓసీడీకి ఒక రూపం అని పేర్కొంటున్నారు. అయితే ఈ అలవాటు అంత డేంజర్ కాకపోయినా కొన్ని ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా అదేపనిగా ముక్కులో వేలు పెట్టుకోవడం వల్ల ముక్కుపుటాలకు గాయాలు కావడం, ముక్కు కణజాలానికి రంధ్రాలు పడటం, వేలు ద్వారా బ్యాక్టీరియా చేరి ఇన్ఫెక్షన్లు వస్తాయని డచ్‌కు చెందిన హెల్త్, న్యూరోసైన్సెస్ పరిశోధకులు చేసిన అధ్యయనంలో తేలింది. ఈ అలవాటు ఉన్న వాళ్లు దీనితోపాటు గోళ్లు కొరకడం, జుట్టు పీక్కోవడం కూడా చేస్తారట. అయితే ఈ అలవాటు ఉన్న వాళ్లకు ఇది చెడు అలవాటు అని తెలియదట. ఎదుటి వాళ్లు చెప్పినా దానిని అంతగా పట్టించుకోరట. కానీ వర్కింగ్ ప్లేస్, పబ్లిక్ ప్లేస్‌లో ఇలా చేస్తే అసహ్యంగా ఉంటుందనేది జగమెరిగిన సత్యం. ఈ అధ్యయనంలో వెల్లడైన మరో అంశం ఏంటంటే.. ముక్కులో వేలు పెట్టుకునే అలవాటు కేవలం మగవారిలోనే ఉంటుందట. ఆడవారిలో ఉన్నా అది చిన్నతనంలోనే మర్చిపోతారని పరిశోధకులు గుర్తించారు.

# ఇంట్లో ఈ మొక్కలను నాటకండి



చాలా మందికి ఇంట్లో మొక్కల్ని చెట్లని పెంచడం అంటే ఎంతో ఇష్టపడతారు. చెట్లు, మొక్కలు సానుకూల శక్తితో పాటు ఇంటికి పచ్చదనాన్ని అందిస్తా యి. అలాగే హింద´ూ మతం లో చెట్లు, మొక్కలను పూజిస్తా రు. ఇంట్లో తులసి మొక్కను నాటడం చాలా శుభప్రదంగా పరిగణిస్తారు. చెట్లు, మొక్కలు ఇంటి వాతావరణాన్ని ఆహ్లాదకరం గా మారుస్తాయి. అలాగే జీవితంలో సానుకూలతను పెంచుతాయి. కానీ వాస్తుశాస్త్రం ప్రకారం కొన్ని చెట్లు, మొక్కలు ఇంటి ఆవరణంలో నాటకూడదని సూచిస్తున్నారు పండితులు. ఎందుకంటే ఇంట్లో కొన్ని చెట్లు, మొక్కలు నాటడం వల్ల నెగిటివ్ ఎనర్జీ వస్తుందట. అలాగే ఇంటి ఆర్థిక పరిస్థితి, కుటుంబ సభ్యుల ఆరోగ్యం పై చెడు ప్రభావం చూపుతుందట. మరి ఆ మొక్కలేవో ఇప్పుడు తెలుసుకుందాం. వాస్తు ప్రకారం ఇంట్లో కొన్ని ముళ్ల మొక్కలు, పీపుల్ చెట్టు, ఖర్జూర చెట్టు, చింత చెట్టు నాటడం వాస్తు ప్రకారం మంచిది కాదని పండితులు చెబుతున్నారు. అయితే మీరు ఇంట్లో ఈ చెట్లు, మొక్కలను నాటాలనుకుంటే మీరు వాటిని మీ ఇంటి వెలుపల ఖాళీ స్థలంలో నాటవచ్చు. ఇది ఇంటి సభ్యుల పై ఎటువంటి ప్రతికూల ప్రభావాన్ని చూపదు.

**తాటి చెట్టు..:** ఇంట్లో ఖర్జూర చెట్టును నాటడం వల్ల కుటుంబ సభ్యుల పురోగతి పై ప్రభావం పడుతుందని నమ్ముతారు. ఇంట్లో ఖర్జూర చెట్టును నాటడం వల్ల ఇంట్లో ఆనందం, శాంతి కోసం అశుభకరమైనదిగా భావిస్తారు. ఈ చెట్టు చాలా అందంగా కనిపిస్తుంది. కానీ వాస్తు శాస్త్రం ప్రకారం దీనిని ఇంటి లోపల నాటడం వల్ల ఇంట్లో ఆర్థిక సమస్యలు కూడా వస్తాయి. అందుకే ఈ మొక్కను ఇంట్లో నాటకూడదని చెబుతారు.

**రావిచెట్టు..:** హిందూ మతంలో ప్రతి శనివారం రావిచెట్టును పూజిస్తారు. కానీ వాస్తుశాస్త్రం ప్రకారం ఇంట్లో రావి చెట్టును నాటడం మంచిది కాదని చెబుతారు. రావిచెట్టు దేవతల నివాసంగా పరిగణిస్తారు. అందుకే రావిచెట్టును కత్తిరించరు. మీ ఇంట్లో రావి చెట్టు దానంతట అదే పెరిగినా, దానిని తీసుకెళ్లి గుడిలో లేదా మరేదైనా పవిత్ర స్థలంలో నాటాలి. చింత చెట్టు..: వాస్తు ప్రకారం చింత చెట్టును ఇంట్లో ఎప్పుడూ నాటకూడదు. దీన్ని ఇంట్లో నాటడం వలన నెగిటివ్ ఎనర్జీ వస్తుందట. చింత చెట్టు నాటిన ఇంటి పెద్దలు అనారోగ్యం బారిన పడతారని నమ్ముతారు.ముళ్ళ మొక్కలు..: ఇంట్లో ముళ్ళ మొక్కలు నాటకూడదు. కొన్ని ముళ్ళ మొక్కలను నాటడం వల్ల ఇంట్లో ప్రతికూలత వస్తుందని పండితులు చెబుతున్నారు. ఇది కుటుంబ సభ్యుల మధ్య అసమ్మతిని కలిగిస్తుంది. ఇది ఇంటి వాతావరణాన్ని పాడు చేస్తుంది.

# బీట్‌రూట్ ఇడ్లీ తిన్నారా..

బీట్‌రూట్ తినడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని అంటారు. అయితే చాలా మంది దీన్ని తినడానికి ఇష్టపడరు. అటువంటి సందర్భాలలో, బీట్‌రూట్ ఇడ్లీ చేసుకుని హ్యాపీగా తినొచ్చు. ఇది మీ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఇడ్లీ దక్షిణాదిలోనే కాకుండా భారతదేశమంతటా ప్రజలకు ఇష్టమైన ఆహారం. కానీ ఇప్పుడు ఇడ్లీని వివిధ రకాలుగా తయారుచేస్తున్నారు. అయితే, ఇప్పుడు బీట్‌రూట్ ఇడ్లీ ఎలా తయారు చేయాలో ఇక్కడ తెలుసుకుందాం..

బీట్‌రూట్ ఇడ్లీ కి కావలసిన పదార్థాలు

ఇడ్లీ కోసం 2 కప్పుల బియ్యం, 1 - కప్పు మినప్పప్పు, 1 మీడియం సైజ్ బీట్‌రూట్, 1 మీడియం సైజ్ ఉల్లిపాయ, సన్నగా తరిగిన 2 పచ్చిమిర్చి, 1 - టీస్పూన్ జీలకర్ర , 1/2 - ఆవాలు, 1/2 - పసుపు పొడి, కారం, ఇంగువ 2-3 టేబుల్ స్పూన్లు, నెయ్యి, 5-6 కరివేపాకు. రెబ్బలు.

బీట్‌రూట్ ఇడ్లీ తయారీ విధానం

బియ్యాన్ని కడిగి నానబెట్టి రెండు వేరు వేరు గిన్నెలలో ఉడికించాలి. 6-7 గంటలు అలాగే ఉంచండి. నానబెట్టిన తరువాత, దానిని పేస్ట్ లాగా తయారు చేస్తారు. పప్పు బియ్యం ముద్దలు ఏర్పడకుండా ఉండటానికి కొంచెం నీరు కలపండి. ఇది రాత్రిపూట పులియనివ్వండి. తరిగిన బీట్ రూట్ ని మిక్సీ వేసి మెత్తని పేస్ట్‌లా చేసుకోవాలి. వాటికి నీటిని జోడించండి. ఇడ్లీ పిండిని రాత్రంతా పులియబెట్టిన తర్వాత, బీట్‌రూట్ పేస్ట్, కొంచెం ఉప్పు వేసి బాగా కలపాలి. ఇడ్లీ ప్లేట్‌లో నూనె లేదా నెయ్యి వేసి, బీట్‌రూట్ పేస్ట్ జోడించండి. 15-20 నిమిషాలు వరకు స్టీమర్‌లో ఇడ్లీని ఆవిరి చేయండి.



# స్థానిక వార్తలు

## యూట్యూబ్ టీవీకి పోటీగా ఎక్స్ టీవీ యాప్!



ఎక్స్.కామ్ బాస్ ఎలోన్ మస్క్ కీలక నిర్ణయం తీసుకున్నారు. యూట్యూబ్ టీవీకి పోటీగా త్వరలో అమెజాన్, శామ్‌సంగ్ వినియోగదారుల కోసం టీవీ యాప్‌ను ప్రారంభించాలని యోచిస్తున్నట్లు ఫార్చ్యూన్ మ్యాగజైన్ రిపోర్ట్ వెలుగులోకి వచ్చాయి. దీనిపై స్పందించిన మస్క్ స్మార్ట్ టీవీల్లో లాంగ్ ఫార్మ్ వీడియోలు త్వరలో అందుబాటులో తెస్తామని ప్రకటించారు. గతంలో ఎక్స్.కామ్‌ను ఎవ్రీథింగ్ యాప్ మార్చే యోచనలో ఉన్నట్లు మస్క్ వెల్లడించారు. అందుకు అనుగుణంగా యాప్‌లో నగదు లావాదేవీల సేవల్ని అందుబాటులోకి తెచ్చారు. ఆ తర్వాత గత అక్టోబర్‌లో ఎంపిక చేసిన వినియోగదారుల కోసం వీడియో, ఆడియో కాలింగ్ ప్రారంభ వెర్షన్‌ను విడుదల చేశారు. ఇప్పుడు టీవీల్లో ఎక్స్.కామ్ టీవీ యాప్‌ను తెచ్చే పనిలో ఉన్నారు. ఇదే విషయంపై ఓ యూజర్ అడిగిన ప్రశ్నకు మస్క్ క్లారిటీ ఇచ్చారు. త్వరలో వచ్చేస్తుంది. ఎక్స్.కామ్‌లోని లాంగ్ వీడియోలు టీవీల్లో చూసే వెసలు బాటు కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

## నథింగ్ ఫోన్ 2ఏ వచ్చేసింది.. ధర ఎంతంటే?



లండన్‌కు చెందిన ప్రముఖ స్మార్ట్ ఫోన్ కంపెనీ నథింగ్‌కు మంచి ఆదరణ లభించిన విషయం తెలిసిందే. భారత్‌లో ఈ స్మార్ట్ ఫోన్ అమ్మకాలు భారీగా జరిగాయి. నథింగ్ ఫోన్1 ప్రీమియం మార్కెట్‌ను టార్గెట్ చేసుకొని వస్తే.. తాజాగా ఈ బ్రాండ్ నుంచి మిడ్ రేంజ్ బడ్జెట్ ఫోన్‌ను తీసుకొచ్చింది. ప్రస్తుతం ఈ ఫోన్ యూజర్లకు అందుబాటులోకి వచ్చింది. బ్లాక్, వైట్ వేరియంట్‌లో నథింగ్ ఫోన్ 2ఏ మార్చి 5న ఆవిష్కరించింది. ఆండ్రాయిడ్ ఓఎస్‌లో ఆసక్తికరమైన టేకింగ్‌కు పేరుగాంచిన నథింగ్ గతంలో ఒరిజినల్ నథింగ్ ఫోన్ (2022), నథింగ్ ఫోన్ 2 (2023)లను ప్రారంభించింది. రూ.23,999 నుండి ప్రారంభమయ్యే ఈ ఫోన్‌లో 6.7-అంగుళాల అమోలెడ్ డిస్‌ప్లే, మీడియా టెక్ డైమన్సిటీ 7200 ప్రో ప్రాసెసర్, వెనుకవైపు డ్యూయల్ 50 ఎంపీ కెమెరా సెటప్, 5,000 ఎంఏహెచ్ బ్యాటరీ ఉన్నాయి.

# వచ్చే ఐదేళ్లలో 10 లక్షల ఉద్యోగాలు

**చిప్‌ల తయారీ రంగంలో నియామకాల వెల్లువ!**

**న్యూఢిల్లీ:** దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న సెమీకండక్టర్ల (చిప్) తయారీ రంగంలో నిపుణులకు భారీ డిమాండ్ నెలకొంది. ఈ ఏడాది చిప్‌ల తయారీ ఇండస్ట్రీలో ఉద్యోగుల డిమాండ్ 40,000-50,000 స్థాయిలో ఉండవచ్చని, గత ఏడాదితో పోలిస్తే 25-30 శాతం పెరగవచ్చని ప్రముఖ స్టాఫింగ్ సేవల కంపెనీ ర్యాండ్‌స్టడ్ అంటోంది. వచ్చే ఐదేళ్లలో ఈ రంగం 8-10 లక్షలకు పైగా నియామకాలు చేపట్టవని అంచనా వేసింది. చిప్‌ల తయారీలో భారత్‌ను అంతర్జాతీయ హబ్‌గా అభివృద్ధి చేయాలని మోదీ సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది. అందులో భాగంగా, 1,500 కోట్ల డాలర్ల (దాదాపు రూ.1.25 లక్షల కోట్లు) విలువైన పెట్టుబడులతో కూడిన మూడు చిప్‌ల తయారీ ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ గతనెలలోనే ఆమోదం తెలిపింది.



చిప్‌ల తయారీ రంగంలో నిపుణులకు డిమాండ్ ఆల్‌టైం రికార్డు స్థాయికి చేరుకుందని, వీటి తయారీకి అవసరమైన మౌలిక వసతులు, ఇండస్ట్రియల్ పార్క్‌లు, టెస్టింగ్ సిస్టమ్స్, ఆర్ అండ్ డీ వసతుల అభివృద్ధికి భారీ సంఖ్యలో ఉద్యోగులు అవసరమని ర్యాండ్‌స్టడ్ ఇండియా చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ వై గిరి అన్నారు. గుజరాత్, బెంగళూరు, తెలంగాణ, తమిళనాడు, అసోం రాష్ట్రాల్లోని ఈ రంగ కంపెనీల్లో సేల్స్, ఫీల్డ్ అప్లికేషన్ ఇంజనీర్స్, ఎక్విపమెంట్ సర్వీస్ ఇంజనీర్, పర్చేజ్ మేనేజర్స్ విభాగాల్లో ఎంట్రీ, మిడ్ లెవెల్ ఉద్యోగుల నియామకాలు పెరిగాయన్నారు. అలాగే, వచ్చే కొన్నేళ్లలో చిప్ డిజైన్, ఫ్యాబ్రికేషన్, చిప్ అసెంబ్లింగ్, టెస్టింగ్, మార్కింగ్ అండ్ ప్యాకేజింగ్ వసతుల్లో నియామకాలు జోరందుకోవచ్చని ఇండస్ట్రీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఉన్నతోద్యోగుల విషయానికొస్తే, ఫీల్డ్ ఇంజనీరింగ్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ విభాగాల్లో వైస్ ప్రెసిడెంట్, డైరెక్టర్ స్థాయి వారికి డిమాండ్ పెరగనుందని గిరి పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ రంగంలో నిపుణుల కొరత అధికంగా ఉండటంతో కంపెనీలు ఇప్పటికే అనుభవం కలిగిన వారితోపాటు ప్రాంగణ నియామకాల ద్వారా ఫ్రెషర్లను సైతం నియమించుకునే ఆలోచనలో ఉన్నాయట. ఉద్యోగావకాశాలతోపాటు ఈ రంగంలో పనిచేసే వారికి వేతనాలూ భారీ స్థాయిలోనే లభించనున్నాయి. ఎంట్రీ లెవెల్ డిజైన్ ఇంజనీర్లకు రూ.15 -20 లక్షల నుంచి ఎగ్జిక్యూటివ్ పోస్టులకు రూ.2.5 కోట్ల వరకు వార్షిక ప్యాకేజీ లభించవచ్చని ఏబీసీ కన్సల్టెంట్స్ ప్రతినిధి మురళీ మోహన్ అన్నారు. సెమీకాన్ మాన్యుఫాక్చరింగ్, ఔట్‌సోర్స్‌డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్ట్ (ఓఎసఏటీ) విభాగాల్లో నిపుణుల కొరత అధికంగా ఉందని, 4-12 ఏళ్ల అనుభవం కలిగిన వారి నియామకాలు అధికంగా జరుగుతున్నాయని మురళీ అన్నారు.

# స్టాక్ మార్కెట్ మదుపరులు దేశంలో 8.7 కోట్ల

**ముంబై:** దేశంలో స్టాక్ మార్కెట్ మదుపరుల సంఖ్య ఏటికేటికి పెరిగిపోతోంది. 2015 మార్చి నాటికి 1.79 కోట్లుగా ఉన్న వీరి సంఖ్య ఈ ఏడాది జనవరి నెలాఖరుకు 389 శాతం పెరిగి 8.7 కోట్లకు చేరింది. ఇందులో దాదాపు 54 శాతం మదుపరులు మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, గుజరాత్, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఉన్నట్టు ఎన్‌ఎసఈ విడుదల చేసిన తాజా గణాంకాలు తెలుపుతున్నాయి. మొత్తం మదుపరుల్లో 17.4 శాతం (1.53 కోట్ల) వాటాతో మహారాష్ట్ర అగ్రస్థానంలో ఉంది. అయితే 2014 మార్చి నెలాఖరుతో పోలిస్తే ఈ ఏడాది జనవరి నెలాఖరుకు దేశంలోని మొత్తం స్టాక్ మార్కెట్ మదుపరుల్లో మహారాష్ట్ర మదుపరుల వాటా 19.9 శాతం నుంచి 17.4 శాతానికి పడిపోయింది.




**రెండో స్థానంలో ఉత్తర ప్రదేశ్**

ఇదే సమయంలో ఉత్తర ప్రదేశ్‌లో స్టాక్ మార్కెట్ పెట్టుబడుల కల్చర్ బాగా పెరిగింది. దీంతో 2022 నవంబరులో గుజరాత్‌ని తోసిపుచ్చి ఉత్తర ప్రదేశ్ రెండో స్థానానికి ఎదిగింది. 2014 మార్చి నాటికి దేశంలోని స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లలో ఆ రాష్ట్ర వాటా కేవలం 6.9 శాతం. ఈ ఏడాది జనవరి నెలాఖరు నాటికి అది 10.7 శాతానికి చేరింది. ఇదే సమయంలో మదుపరుల సంఖ్యా 12.4 లక్షల నుంచి 93.6 లక్షలకు చేరింది.

**మూడో స్థానంలో గుజరాత్**

స్టాక్ మార్కెట్ కల్చర్ అధికంగా ఉండే గుజరాత్ ప్రస్తుతం మదుపరుల పరంగా చూస్తే తొమ్మిది శాతంతో మూడో స్థానంలో ఉంది. పశ్చిమ బెంగాల్, కర్ణాటక, రాజస్థాన్ రాష్ట్రాలు 5.6 శాతం చొప్పున వరుసగా నాలుగు, ఐదు, ఆరో స్థానాల్లో నిలిచాయి. స్టాక్ మదుపరులపరంగా చూస్తే ఆంధ్రప్రదేశ్ 4.6 శాతం (40.05 లక్షల మంది) వాటాతో తొమ్మిదో స్థానంలో ఉంది. ఏపీ కంటే ముందు 5.5 శాతం (48.6 లక్షల మంది) వాటాతో తమిళనాడు ఏడు, 4.8 శాతం (41.8 లక్షల మంది) వాటాతో మధ్యప్రదేశ్ ఎనిమిదో స్థానంలో నిలిచాయి. ఢిల్లీ (4.6 శాతం), బిహార్ (4.1 శాతం) వరుసగా తరువాతి స్థానాల్లో నిలిచాయి. 2015 మార్చితో పోలిస్తే బిహార్ స్థానం 1.6 శాతం (2.94 లక్షల మంది) నుంచి 4.1 శాతానికి (35.9 లక్షల మంది) పెరగడం విశేషం.

# మరోసారి విధ్వంసం సృష్టించిన శార్దూల్ ఠాకూర్



టీమిండియా ఆల్‌రౌండర్, ముంబై ప్లేయర్ శార్దూల్ ఠాకూర్ రంజీల్లో చెలరేగిపోతున్నాడు. ఇటీవల తమిళనాడుతో జరిగిన సెమీఫైనల్లో మెరుపు శతకం (104 బంతుల్లో 109) బాది జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన శార్దూల్.. ప్రస్తుతం విదర్భతో జరుగుతున్న ఫైనల్లో విధ్వంసకర అర్ధసెంచరీ (69 బంతుల్లో 75బీ 8 ఫోర్లు, 3 సిక్సర్లు) చేసి తన జట్టుకు గౌరవప్రదమైన స్కోర్‌ను అందించాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై.. విదర్భ బౌలర్లు రెచ్చిపోవడంతో 224 పరుగులకే పరిమితమైంది. హర్ష్ దూబే (3/62), యశ్ ఠాకూర్ (3/54), ఉమేశ్ యాదవ్ (2/43), ఆదిత్య థకారే (1/36) ముంబై పతనాన్ని శాశించారు. ముంబై ఇన్నింగ్స్‌లో శార్దూల్ ఠాకూర్ టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ముంబై ఇన్నింగ్స్‌కు ఓపెనర్లు పృథ్వీ షా (46), భూపేన్ లాల్వాని (37) శుభారంభాన్ని అందించినప్పటికీ.. మిడిలార్డర్ వైఫల్యం ఆ జట్టు కొంప ముంచింది. ముషీర్ ఖాన్ (6), అజింక్య రహానే (7), శ్రేయస్ అయ్యర్ (7), హార్దిక్ తామోర్ (5), షమ్స్ ములానీ (13) తక్కువ స్కోర్లకే పెవిలియన్‌కు చేరారు. భీకరఫామ్‌లో ఉన్న 10, 11వ ఆటగాళ్లు తనుశ్ కోటియన్ (8), తుషార్ దేశ్‌పాండే (14) ఈ మ్యాచ్‌లో చేతులెత్తేశారు. బ్యాటింగ్‌లో రాణించిన శార్దూల్.. బౌలింగ్‌లోనూ సత్తా చాటాడు. ముంబై ఇన్నింగ్స్ అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన విదర్భను శార్దూల్ ఆదిలోనే దెబ్బకొట్టాడు. శార్దూల్ విదర్భ ఓపెనర్, ఇన్ ఫామ్ బ్యాటర్ ధృవ్ షోరేను డకౌట్ చేసి పెవిలియన్‌కు పంపాడు. నాలుగు ఓవర్ల అనంతరం? విదర్భ స్కోర్ వికెట్ నష్టానికి నాలుగు పరుగులుగా ఉంది.

# స్పోర్ట్స్

## సౌదీ గ్రాండ్ ప్రిక్స్‌లో మాజీ చాంపియన్ హవా.. వరుసగా రెండో విజయం



ఫార్ములా వన్ దిగ్గజం, వరల్డ్ చాంపియన్ మాక్స్ వెర్స్‌టప్పన్ సౌదీ అరేబియన్ గ్రాండ్‌ప్రిక్స్‌లో దుమ్మురేపాడు. జెడ్డాలో శనివారం జరిగిన పోరులో ఈ రెడ్ బుల్ డ్రైవర్ తన వేగానికి తిరుగు లేదని చాటాడు. రేసింగ్ కారును ఓ రేంజ్‌లో పరుగులు పెట్టించి వరుసగా రెండో విజయం నమోదు చేశాడు. తన జట్టుకే చెందిన మరో డ్రైవర్ సెర్గియో పెరెజ్ కంటే 13 సెకన్ల ముందే ఫినిషింగ్ లైన్ చేరాడు. మరోవైపు ఫెరారీ డ్రైవర్ ఒలీవర్ బీర్‌మన్ అరంగేట్రం రేసులోనే ఆకట్టుకున్నాడు. కార్లోస్ సైన్జ్ స్థానంలో బరిలోకి దిగిన ఒలీవర్.. తన సూపర్ డ్రైవింగ్ స్కిల్స్‌తో ఆరు పాయింట్లు సాధించాడు. లాండో నోరిస్(మెక్‌లారెన్)తో కలిసి బ్రిటన్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన అతడు 8వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. మాజీ చాంపియన్ లెవిస్ హామిల్టన్ 9వ స్థానంతో నిరాశపరిచాడు.

# ముంబై, ఢిల్లీ ఖరారు.. మిగిలిన మూడు జట్లలో ప్లేఆఫ్స్ చేరెదెవరు..?

ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) గ్రూప్ దశ పోటీలు చివరి అంకానికి చేరాయి. లీగ్ దశలో శనివారం గుజరాత్ జెయింట్స్ %--% ముంబై ఇండియన్స్ మధ్య జరిగిన పోరుతో ఈ లీగ్‌లో 16 మ్యాచ్‌లు ముగిశాయి. నాలుగు మ్యాచ్‌లు మాత్రమే మిగిలున్న ఈ స్టేజ్‌లో ముంబై ఇండియన్స్ ఇప్పటికే అధికారికంగా ప్లేఆఫ్స్ బెర్తును ఖాయం చేసుకుంది. ఢిల్లీ క్యాపిటల్స్ (మరో మ్యాచ్ గెలిస్తే చాలు) కూడా దాదాపు ప్లేఆఫ్స్ చేరినట్టే. మరి నాకౌట్ దశకు చేరే మూడో జట్టు ఏది..? యూపీ వారియర్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు.. ఈ మూడు జట్లలో ప్లేఆఫ్స్ వెళ్లేదెవరు..? ఏ జట్టుకు అక్కడికి వెళ్లడానికి అవకాశాలు ఏవిధంగా ఉన్నాయి.

**గుజరాత్ జెయింట్స్..**

గుజరాత్.. ముంబైపై 190 పరుగులు చేసినా ఓటమి తప్పలేదు. హర్మన్ ప్రీత్ కౌర్ దంచికొట్టడంతో గుజరాత్ ఓటమిపాలైంది. దీంతో ఆ జట్టు ప్లేఆఫ్స్ చేరే గోల్డెన్ ఛాన్స్ మిస్ చేసుకుంది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఆరు మ్యాచ్‌లు ఆడి ఒక్కటి మాత్రమే గెలిచి రెండు పాయింట్లతో ఉన్న గుజరాత్.. ప్లేఆఫ్స్ చేరాలంటే తర్వాత ఆడబోయే రెండు మ్యాచ్‌లలో గెలవడంతో పాటు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఆడాల్సి ఉన్న మిగిలిన రెండు మ్యాచ్‌లలో ఓడిపోవాలి.

**యూపీ వారియర్స్..**

గత సీజన్‌లో ప్లేఆఫ్స్ వరకూ వెళ్లగలిగిన యూపీ ఈసారి ఏడు మ్యాచ్‌లు ఆడి మూడింట్లో గెలిచి నాలుగు ఓడింది. ఈ సీజన్‌లో మరో మ్యాచ్ మాత్రమే ఆడనున్న ఆ జట్టుకు ప్లేఆఫ్స్ అవకాశాలు తక్కువే. ఒకవేళ యూపీ.. తర్వాత మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్‌ను ఓడించినా ప్లేఆఫ్స్ చేరాలంటే ఆర్సీబీ ఆడాల్సి ఉన్న తర్వాత రెండింట్లోనూ ఒకదాంట్లో ఓడిపోవాలి.

**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు..**

ఆర్సీబీ ఈ సీజన్‌లో ఆరు మ్యాచ్‌లు ఆడి మూడు గెలిచి మూడింట ఓడింది. పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో ఉన్న ఆర్సీబీ.. తమ తర్వాతి రెండు మ్యాచ్‌లలో ఢిల్లీ క్యాపిటల్స్, ముంబై ఇండియన్స్‌లను ఢీకొనుంది. ఈ రెండింట్లో ఏదో ఒకటి అయితే కచ్చితంగా నెగ్గాలి. ఆర్సీబీ.. ఈ రెండు మ్యాచ్‌లలో ఏదో ఒకదాంట్లో గెలిచినా గుజరాత్ జెయింట్స్ కథ ముగిసినట్టే.



# త్రిషకు చిరంజీవి ఖరీదైన కానుక.. విశ్వంభర నయా అప్‌డేట్



సిల్వర్ స్క్రీన్‌పై స్టాలిన్ సినిమాతో తొలిసారి సందడి చేశారు చిరంజీవి త్రిష. ఈ ఇద్దరూ మళ్లీ 18 ఏండ్ల తర్వాత విశ్వంభర సినిమాతో ఎంటర్‌టైన్ చేసేందుకు రెడీ అవుతున్నారని తెలిసిందే. సోషియో ఫాంటసీ నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రాన్ని బింబిసార ఫేం వశిష్ఠ మల్లిడి డైరెక్ట్ చేస్తున్నాడు. కాగా ఎప్పుడెప్పుడు చిరుతో కలిసి షూటింగ్‌లో పాల్గొంటానా..? అని ఎదురుచూస్తున్న త్రిషకు ఆ రోజు రానే వచ్చింది. ఇవాళ హైదరాబాద్‌లో జరుగుతున్న విశ్వంభర షూటింగ్‌లో జాయిన్ అయింది త్రిష. అంతేకాదు ఈ సందర్భంగా చిరు నుంచి ఓ ప్రత్యేకమైన కానుకను అందుకుంది త్రిష. ఈ విషయాన్ని తెలియజేస్తూ తన సంతోషాన్ని ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అందరితో షేర్ చేసుకుంది. ఉష్ణోగ్రతను నియంత్రించే స్మార్ట్ మగ్‌ను త్రిషకు బహుమానంగా అందించారు. చాలా ఖరీదైంది.. ఉష్ణోగ్రతను కంట్రోల్ చేసే నా స్మార్ట్ మగ్. చిరు సార్.. ధన్యవాదాలు అంటూ క్యాప్షన్ పెట్టింది. ఇప్పుడీ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ విక్రమ్ తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీకి ఆర్‌ఆర్‌ఆర్ ఫేం లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి బ్యాక్ గ్రౌండ్ స్కోర్, సంగీతం అందిస్తున్నారు. విశ్వంభర కాన్సెప్ట్ వీడియో మిలియన్ల సంఖ్యలో డిజిటల్ వ్యూస్ రాబడుతోంది. ఇప్పటికే లాంఛ్ చేసిన టైటిల్ లుక్, కాన్సెప్ట్ వీడియో సినిమాపై అంచనాలు అమాంతం పెంచేస్తుంది. ఈ చిత్రాన్ని 2025 జనవరి 10న గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. పురాణాలు ఢీకొట్టినప్పుడు లెజెండ్స్ ఉద్భవిస్తారు.. అనే క్యాప్షన్ పోస్టర్‌లో కనిపిస్తుండగా.. చిరు స్టైలిష్ వాక్‌తో కొత్త ప్రపంచంలోకి వెళ్తున్నట్టుగా ఉన్న లుక్ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది.

# ఎస్ఎస్ఎంబీ 29పై హింట్ ఇచ్చేసిన మహేశ్ బాబు.. ట్రెండింగ్‌లో నయా యాడ్



టాలీవుడ్ సూపర్ స్టార్ మహేశ్‌బాబు అభిమానుల ఫోకస్ అంతా ఇప్పుడు ఎస్ఎస్ఎంబీ 29పైనే ఉంది. గుంటూరు కారం సక్సెస్ తర్వాత జక్కన్న, మహేశ్‌బాబు గ్లోబల్ అడ్వెంచరస్ ప్రాజెక్ట్ అప్‌డేట్స్ గురించి నెట్టింట తెగ వెతికేస్తున్నారు. ఇదిలా ఉంటే ఎస్ఎస్ఎంబీ 29 మూవీ హాలీవుడ్ రేంజ్‌కు ఏ మాత్రం తగ్గకుండా ఉంటుందని ఇప్పటివరకు వచ్చిన వార్తలు చెబుతున్నాయి. మహేశ్ బాబు సినిమాలతోపాటు యాడ్స్‌కు కూడా సూపర్ క్రేజ్ ఉంటుందని తెలిసిందే. కూల్ డ్రింక్ మౌంటెయిన్ డ్యూను ప్రమోట్ చేస్తున్నాడని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. తాజాగా మౌంటెయిన్ డ్యూ కొత్త యాడ్ నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఆపదలో ఉన్న స్నేహితుడికి సాయం చేసేందుకు మహేశ్ బాబు చేసే రిస్కీ స్టంట్స్‌తో కట్ చేసిన యాడ్ సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఎస్ఎస్ఎంబీ 29 కూడా ఇలా గూస్‌బంప్స్ తెప్పించే రిస్కీ షాట్స్, సన్నివేశాలతో ప్రేక్షకులను రక్తకట్టించేలా ఉండబోతుందని తాజా వీడియోతో హింట్ ఇచ్చేశాడంటున్నారు సినీ జనాలు. ఆఫ్రికన్ అడ్వెంచరస్ ప్రాజెక్ట్‌గా రాబోతున్న ఎస్ఎస్ఎంబీ 29 గురించి.. మిక్స్‌డ్ స్టిల్ షేర్ చేస్తూ.. క్యాప్షన్ లేదు.. ఫొటో చాలా మాట్లాడుతుంది.. ప్రీ ప్రొడక్షన్ వర్క్ కొనసాగుతోంది.. ఇప్పటికే ఆన్‌లైన్‌లో ఓ వార్త హల్ చల్ చేస్తోంది. దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. ఇంటర్నేషనల్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రంలో పాపులర్ హాలీవుడ్ యాక్టర్‌తోపాటు వరల్డ్‌వైడ్‌గా ఉన్న స్టార్ యాక్టర్లను తీసుకోవాలని ప్లాన్ చేస్తున్నట్టు సమాచారం.

ఈ చిత్రాన్ని జక్కన్న టీం 2026 ఉగాది కానుకగా రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నట్టు ఫిలింనగర్ సర్కిల్ టాక్. మోస్ట్ సక్సెస్‌ఫుల్ డైరెక్టర్లలో ఒకరైన జక్కన్న కాంపౌండ్ రాబోతున్న ఈ సినిమా కోసం రామోజీఫిలిం సిటీలో ఏకంగా రూ.100 కోట్ల ఖర్చుతో భారీ సెట్ వేసినట్టు ఇప్పటికే టాలీవుడ్ సర్కిల్‌లో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. జక్కన్న పర్యవేక్షణలో మహేశ్ బాబు లుక్ టెస్ట్ కూడా పూర్తి చేసినట్టు తెలుస్తోండగా.. ఇప్పటివరకు 8 లుక్స్ ఫైనల్ చేశారట. కాగా మహేశ్ బాబును నయా అవతార్‌లో జక్కన్న ఎలా చూపించబోతున్నాడోనని చూసేందుకు ఎక్జయిటింగ్‌గా ఎదురుచూస్తున్నారు అభిమానులు.

# బ్యాక్ బెంచ్ అమ్మాయిని.. అందుకే ఈ నిర్ణయం..



నేనెప్పుడూ వెనకబెంచ్‌కే పరిమితం. అందుకే జీవితంలో స్థిరపడాలంటే చదువుతో సంబంధం లేకుండా వేరే ఏదైనా చేయాలని చిన్నప్పుడే నిర్ణయించుకున్నా. అయితే సినిమాల్లోకి వస్తానని మాత్రం అస్సలు ఊహించలేదు. ఓ రోజు నా సోదరుడి స్నేహితుడు (ఫొటోగ్రాఫర్) సరదాగా 'టెస్ట్ ఫొటో షూట్ చేద్దాం' అన్నాడు. సరేనని కొన్ని పోజులిచ్చా. అతనే నా ఫొటోలను ఎవరికో పంపించాడు. ఇక అక్కడి నుంచి అవకాశాలు రావడం మొదలయ్యాయి. క్రమంగా నటనతో ప్రేమలో పడ్డా. ఒకప్పుడు అందరమ్మాయిల్లాగే కాబోయే వాడు అందగాడై ఉండాలనుకునేదాన్ని. కానీ ఇప్పుడు నా ఆలోచన విధానం పూర్తిగా మారిపోయింది. నా జీవితంలోకి వచ్చేవాడు నన్ను మాత్రమే కాదు, నా చుట్టూ ఉన్న వాళ్లను కూడా అర్థం చేసుకునే మంచి మనసున్న వ్యక్తి అయి ఉండాలి. ఎలాంటి వ్యత్యాసం చూపకుండా నన్ను కూడా తనతో సమానంగా భావించేవాడై ఉండాలి. అంతకుమించి ఇంకేమి అక్కర్లేదు. ఒకప్పుడు నేను ఇంట్రొవర్ట్‌ని. ఎవరితోనూ పెద్దగా కలిసేదాన్ని కాదు. ఇంటికెవరైనా బంధువులొచ్చినా సరే వాళ్లతో మాట్లాడడానికి కూడా ఇబ్బంది పడేదాన్ని. క్లాస్‌రూంలో సందేహాలు కూడా అడిగేదాన్ని కాదు. కాలేజీకి వచ్చేసరికి నా ఆలోచనల్లో మార్పు వచ్చింది. మొదటిసారి ఆడిషన్‌కి వెళ్లినప్పుడు కెమెరా ముందు కాస్త తడబడినా ఆశ్చర్యంగా సెలెక్టయ్యా. అలా నా మొదటి సినిమా 'పోస్టర్ బాయ్స్' షురూ అయ్యింది. ఆ తర్వాత వరుసగా 'లైలా మజ్ను', 'బుల్‌బుల్', 'ఖాలా'లో నటించా. మొత్తానికి కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి నా భయాలతో పోరాడాలని నిర్ణయించుకున్నాను

# రాణి రుక్మిణి దేవిగా రీతూవర్మ..



**శ్రీవిష్ణు 'స్వాగ్' నయా లుక్ వైరల్**

కొత్తదనంతో కూడిన కథలను ఎంపిక చేసుకుంటూ తెలుగు ప్రేక్షకుల ముందు వినోదాన్ని అందించే ప్రయత్నంలో ఎప్పుడూ ముందుండే హీరో శ్రీ విష్ణు ఇటీవలే తన పుట్టినరోజు సందర్భంగా కొత్త ప్రాజెక్టు స్వాగ్ అప్‌డేట్ కూడా అందించాడు. ఈ మూవీలో రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తోంది. నేడు రీతూవర్మ బర్త్ డే సందర్భంగా ఈ భామ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను షేర్ చేశారు. వింజామర వంశపు రాణి రుక్మిణి దేవిగా రాజసం ఉట్టిపడేలా రాయల్ లుక్‌లో కనిపిస్తూ సినిమాపై అంచనాలు అమాంతం పెంచేస్తుంది. మగ అహంకారానికి మహారాణి గారి సమాధానం.. రాజులని తలదన్నే మా వింజామర వంశ మహారాణి రుక్మిణీదేవికి జన్మదిన శుభాకాంక్షలు.. అంటూ మేకర్స్ లాంఛ్ చేసిన లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. జీఎం శేఖర్ ఆర్ట్ డైరెక్టర్ కాగా.. నందు మాస్టర్ స్టంట్ కొరియోగ్రఫర్. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తుండగా.. వివేక్ కూచిబొట్ల సహనిర్మాతగా వ్యవహరిస్తున్నారు. కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో రానున్న ఈ చిత్రం చారిత్రక నేపథ్యం ఉన్న శ్వాగణిక వంశం కథ అని మేకర్స్ ఇప్పటికే ప్రకటించేశారు. స్వాగ్ చిత్రానికి హసిత్ గోలి దర్శకత్వం వహించబోతున్నాడు. ఈ మూవీకి వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్నాడు. వేద రామన్ శంకరన్ సినిమాటోగ్రఫర్. శ్రీ విష్ణు ప్రస్తుతం ఓ భీమ్ బుష్ అంటూ ఓ సినిమాలో నటిస్తుండగా.. షూటింగ్ దశలో ఉంది. ఈ చిత్రంలో ప్రియదర్శి పులికొండ, రాహుల్ రామకృష్ణ ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. సునీల్ బలుసు నిర్మిస్తున్న ఈ చిత్రానికి సన్నీ ఎంఆర్ సంగీత అందిస్తున్నాడు.

# పిల్లాడిలా ఉంటాననే కంప్లైంట్ ఇప్పటికీ ఉంది



ప్రముఖ దర్శకుడు పూరీ జగన్నాథ్ కొడుకు ఆకాశ్ చాలామందికి తెలుసు. చైల్డ్ ఆర్టిస్ట్‌గా కెరీర్ మొదలుపెట్టిన ఇతడు.. ప్రస్తుతం హీరోగా చేస్తున్నాడు. చివరగా 2022లో 'చోర్ బజార్' అనే మూవీతో వచ్చాడు. కానీ ఫ్లాప్ అయింది. ఇలా చాలారోజుల తర్వాత ఇప్పుడు కనిపించాడు. ఓ క్లాతింగ్ బ్రాండ్‌కి ఆకాశ్ అంబాసిడర్‌గా చేస్తున్నాడు. తాజాగా హైదరాబాద్‌లో లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ క్రమంలోనే పలు ఆసక్తికర విషయాలు చెప్పుకొచ్చాడు. 'నా కెరీర్ పరంగా చూస్తే గత సినిమా 'చోర్ బజార్' అంతగా ఆదరణ దక్కించుకోలేదు. అందుకే ఈసారి నేను చేసే సినిమా చాలా జాగ్రత్తగా ప్లాన్ చేస్తున్నాను. లవ్ స్టోరీ, యాక్షన్ కథలు విన్నాను. అవి ఫైనలైజ్ దశలో ఉన్నాయి. ప్రాజెక్ట్ లాక్ అయ్యాక మీకు వివరాలు చెబుతాను. ఇప్పటికీ నేను చిన్న పిల్లాడిలా ఉంటాననే కంప్లైంట్ ఉంది. హీరోగా సెట్ అయిన తర్వాతే విలన్ తరహా క్యారెక్టర్స్ చేయడం గురించి ఆలోచిస్తా. నాన్న పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో ఇప్పట్లో నటించకూడదని అనుకున్నా' 'నాకు నేనుగా హీరోగా పేరు తెచ్చుకున్న తర్వాతే నాన్న డైరెక్షన్‌లో మూవీ చేస్తా. నాకు అమ్మా నాన్న ఇద్దరి సపోర్ట్ పూర్తిగా ఉంది. నా స్క్రిప్ట్స్ నాన్న చదువుతారు. మన ఇండస్ట్రీలో చాలా గొప్ప సినిమాలు వస్తున్నాయి. కార్తికేయ 2, హనుమాన్ లాంటివి చూసినప్పుడు ఇలాంటి వాటిలో నటించాలనే కోరిక కలుగుతుంటుంది. ఇప్పుడు నేను సింగిల్‌గానే ఉన్నా. ఏ అమ్మాయినీ ప్రేమించడం లేదు' అని ఆకాశ్ చెప్పుకొచ్చాడు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com